Follow: @ANNTELUGU
23-02-2026
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 56 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## పుష్పకే ఫిల్మ్ ఫేర్

### ఉత్తమ నటుడిగా అల్లుఅర్జున్..
### ఉత్తమనటిగా నివేథా థామస్
### అంజలికి ఉత్తమ సహాయనటి అవార్డు..
### కుర్చీమడతపెట్టి.. రెండు అవార్డులు

**మహా :** 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ ప్రదానోత్సవం కొచ్చి వేదికగా అట్టహాసంగా జరిగింది. దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. 'పుష్ప 2: ది రూల్' కోసం ఉత్తమ నటుడు (తెలుగు) అవార్డును అల్లు అర్జున్ అందుకున్నారు. అల్లు అర్జున్‌కు ఇది ఏడవ ఫిల్మ్ ఫేర్ అవార్డు కావడం గమనార్హం. మెగాస్టార్ చిరంజీవి పేరిట ఉన్న దీర్ఘకాల రికార్డును అల్లు అర్జున్ సమం చేశారు. '35: చిన్న కథ కాదు' చిత్రానికి గాను నివేతా థామస్ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. 'పుష్ప-2' సినిమాకు ఎక్కువ అవార్డులు వచ్చాయి. టాలీవుడ్‌కు పలు అవార్డులు దక్కాయి. ఇక టాలీవుడ్ సెన్సేషన్ కుర్చీమడతపెట్టి సాంగ్ రెండు అవార్డులు కొట్టేసింది.

**ఉత్తమ చిత్రం:** పుష్ప 2
**ఉత్తమ దర్శకుడు:** సుకుమార్ (పుష్ప 2)
**ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్:** పుష్ప 2
**ఉత్తమ సహాయ నటుడు:** అమితాబ్ బచ్చన్ (కల్కి2898 ఏడీ)
**ఉత్తమ సహాయ నటి:** అంజలి (గ్యాంగ్ ఆఫ్ గోదావరి)
**ఉత్తమ పరిచయ దర్శకుడు:** యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)
**ఉత్తమ పరిచయ నటి:** నయన్ సారిక (గం గం గణేశా)
**ఉత్తమ సాహిత్యం:** చుట్టమల్లే చుట్టేస్తోంది (దేవర)
**ఉత్తమ గాయకుడు:** శ్రీకృష్ణ (కుర్చీ మడతపెట్టి, గుంటూరు కారం)
**ఉత్తమ గాయని:** శిల్పారావు (చుట్టమల్లె చుట్టేస్తోంది)
**ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్:**
నితిన్ జిహానీ (కల్కి 2898 ఏడీ), రామకృష్ణ, మోనిక (పుష్ప2)
**ఉత్తమ కొరియోగ్రాఫర్:** శేఖర్ మాస్టర్ (కుర్చీ మడతపెట్టి)
**ఉత్తమ చిత్రం (క్రిటిక్స్):** లక్కీ భాస్కర్
**ఉత్తమ నటుడు (క్రిటిక్స్):** తేజ సజ్జా
**ఉత్తమ నటి (క్రిటిక్స్):** కాజల్ అగర్వాల్ (సత్యభామ)







**టాప్ న్యూస్**

దక్షిణాఫ్రికా చేతిలో ...
### టీమిండియా ఘోర పరాజయం
- 76 పరుగుల తేడాతో చిత్తు చేసిన దక్షిణాఫ్రికా

02

### ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్



- పెళ్లిని అధికారికంగా ప్రకటించిన విజయ్ దేవరకొండ, రష్మిక
- అభిమానులు సృష్టించిన 'విరోష్' అనే పేరు పెళ్లికి ఖరారు
- ఫిబ్రవరి 26న పెళ్లి, మార్చి 4న రిసెప్షన్

02

ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ
### హైస్పీడ్ ఇంటర్నెట్



- ఏపీ సీఎం చంద్రబాబు

02

# గోదావరి కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులు కాపాడుతాం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ములుగు, మహా :**
గోదావరి నదీ జలాల వినియోగం, దానిపై తలెత్తిన వివాదాలు, ప్రాజెక్టుల నిర్మాణం వంటి అన్ని అంశాలపై శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో సమగ్రంగా ఒకరోజు చర్చిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు చెప్పారు. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుతామని, ఆ విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అక్కరలేదని పునరుద్ఘాటించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఇంజనీర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , ధనసరి అనసూయ సీతక్క , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి దేవాదుల ఇంటేక్ పాయింట్ వద్ద మోటార్లను పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు స్థితిగతులపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి గ మాట్లాడుతూ, "తెలంగాణ నీటి హక్కుల విషయంలో శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం. ఒక ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముందుకు వెళుతున్నాం. అవసరమైన నిధులను సమీకరిస్తున్నాం. ఎంతటి జఠిలమైన సమస్య అయినా చర్చల ద్వారా పరిష్కారమవుతుందని బలంగా విశ్వసిస్తా. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుతూ శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయి. మాకు ఎలాంటి బేషజాలు లేవు. అధికారుల స్థాయిలో, రెండు రాష్ట్రాల ప్రతినిధులతో చర్చల్లో తేలకపోతే కేంద్ర ప్రభుత్వం వద్ద, లేదా రివర్ మేనేజ్మెంట్ బోర్డుల వద్ద, ట్రిబ్యునళ్ల ముందు లేదా సుప్రీంకోర్టు వరకు ఏదైనా దశల వారిగా వెళ్లాలి. తెలంగాణ నీటి హక్కులను కాపాడే విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అక్కరలేదు. నీటి హక్కుల విషయంలో అనవసరమైన గందరగోళానికి గురిచేయొద్దు. సహేతుకమైన విమర్శలు చేయాలి.

మిగతా 2లో



### సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ 2026 భేష్
- 6553 కి.మీల సైకిల్ యాత్ర అత్యంత క్లిష్టం
- సముద్ర తీర వారసత్వ, రక్షణ బాధ్యతను పునరుద్ఘాటించిన సైక్లోథాన్
- ఏ రంగంలోనైనా మహిళలు ధృఢంగా ఉంటారనడానికి ఈ సైక్లోథాన్ నిదర్శనం
- కేరళలోని కొచ్చిలో 'వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ 2026 లో కేంద్ర మంత్రి బండి సంజయ్

**మహా:** పాదయాత్ర కొంత సులభం కావచ్చు, బస్సు ప్రయాణం చేయడం సులభమే. కానీ "వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ 2026" పేరిట సీఐఎస్ఎఫ్ నిర్వహించిన జాతీయ సైకిల్ యాత్ర అత్యంత

మిగతా 2లో



### డిజిటల్ మోసాలపై అప్రమత్తత అవసరం
**మన్ కీ బాత్ లో దేశ ప్రజలకు ప్రధాని మోదీ కీలక హెచ్చరిక**

**న్యూఢిల్లీ, మహా:** దేశంలో డిజిటల్ మోసాలు పెరిగిపోతున్నాయి. శాంతి భద్రతల పరిరక్షణ కంటే డిజిటల్ మోసాలను కట్టడి చేయటం పోలీసులకు పెద్ద కష్టంగా మారింది. ప్రజలలో అవగాహన కల్పిస్తున్నా సరే ఎక్కడో ఒక చోట ప్రజలు మోసపోతూనే ఉన్నారు.

మిగతా 2లో



### కబ్జాలను తొలగించిన హైడ్రా
**ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి సన్నాహం జై కొట్టిన జనం**

**హైదరాబాద్, మహా :** కొండాపూర్... ఐటీ కారిడార్‌కు చేరువలో.. అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఆక్రమణలను హైడ్రా శనివారం తొలగించింది.

మిగతా 3లో

## దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి సహా... మావోయిస్టు అగ్రనేతల లొంగుబాటు

ఆసిఫాబాద్ అడవుల్లో తెలంగాణ ఎస్ఐబి ఎదుట లొంగుబాటు
మార్చి 31 నాటికి మావోయిస్టుల నిర్మూలనకు కేంద్రం చర్యలు
అడవులను జల్లెడపడుతున్న భద్రతా బలగాలు



**హైదరాబాద్, మహా :** ఆపరేషన్ కగార్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డితోపాటు 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఆదివారం ఆసిఫాబాద్ అడవుల్లో తెలంగాణ ఎస్ఐబీ ఎదుట వీరంతా లొంగిపోయారు. దేవ్ జీ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కేంద్ర కమిటీ సభ్యుడు, సెక్రెటరీ జనరల్‌గా కొనసాగుతున్నారు. గతేడాది జరిగిన

మిగతా 2లో

## డీఎంకేకు సీట్ల చిక్కులు

**ఎక్కువ సీట్లు ఆశిస్తున్న కాంగ్రెస్, డీఎండీకే..**
**కొత్తగా కూటమిలో చేరిన కమల్ హాసన్**



**చెన్నై, మహా :** త్వరలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే పార్టీకి పొత్తుల విషయంలో చిక్కులు కనిపిస్తున్నాయి. సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (ఎస్పీఏ)లో సీట్ల పంపకాలకు సంబంధించి నేటి నుండి చర్చలు ప్రారంభం కానున్నాయి. 2021లో ఏ విధంగా అయితే పంపకాలు జరిగాయో ఈసారి అదే విధంగా ఉండాలని డీఎంకే కోరుకుంటోంది. అదే సమయంలో మిత్రపక్షాలు మరిన్ని ఎక్కువ సీట్లను ఆశిస్తున్నాయి. 2021లో 234 అసెంబ్లీ స్థానాలకు గాను డీఎంకే 188 పోటీ చేయగా, మిగిలిన సీట్లను మిత్ర పక్షాలకు ఇచ్చింది. ఇందులో కాంగ్రెస్ పార్టీ 25 సీట్లు తీసుకోగా, మిగిలిన పక్షాలు సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యాయి.

మిగతా 2లో

## మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి, ఆయన తనయుడికి నోటీసులు జారీ..!

**మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలి లేదంటే చర్యలు**
**కోర్టు ఆదేశాల మేరకే నోటీసులు జారీ: పోలీసులు**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి, ఆయన తనయుడు ప్రశాంత్ కుమార్ రెడ్డిలు అందుబాటులో లేకపోవడంతో వాళ్ల ఇంటి గోడలకు నోటీసు అంటించినట్లు వెల్లడించిన పోలీసులు. వారిద్దరిపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో నమోదైన కిడ్నాప్ కేసు క్రింద, క్రైమ్ నెంబర్ 119/2026 యాక్ట్ 1951 ప్రకారం యు/ సెక్షన్ 35{5} బిఎన్ఎస్ఎస్ తో పాటు పలు సెక్షన్ల క్రింద 8 కేసులు

మిగతా 2లో



### ఇరిగేషన్ బడ్జెట్ రూ.45 వేల కోట్లకు తగ్గింపు
బడ్జెట్ పై ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క సమీక్షలు

వివరాలు 2లో




## విజయ్ పొలిటికల్ ఎంట్రీ- పెరంబూర్ నుంచి పోటీ చేయాలని టీవీకే తీర్మానం



**మహా :** తమిళ హీరో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ కీలక నిర్ణయం తీర్మానం చేసింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధినేత విజయ్ ఎక్కడి నుంచి పోటీ చేయాలనే అంశంపై ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఒక తీర్మానం చేసింది. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులో రాజకీయాలు ఇప్పటికే వేడెక్కాయి. ఎన్నికలు సమయం దగ్గర పడుతుండటంతో పొత్తులు, సీట్ల పంపకాలపై ప్రధాన పార్టీలు దృష్టిసారించాయి. ఇదే సమయంలో ఈ ఎన్నికల ద్వారా రాజకయాల్లోకి అడుగుపెడుతున్న దళపతి విజయ్ ఏ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతారనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఈ ఉత్కంఠకు దాదాపు తొలగింది. విజయ్ పెరంబూర్ నుంచి పోటీ చేయాలని పార్టీ ఎన్నికల ప్రచార నిర్వహణ విభాగం ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సమావేశానికి హాజరైన వేలాది మంది కార్యకర్తలు కరతాళ ధ్వనులతో ఈ తీర్మానానికి ఆమోదం తెలిపారు.

# గోదావరి కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులు కాపాడుతాం

(మొదటిపేజీ తరువాయి)

నికర జలాలు, మిగులు జలాలు, వరద జలాలపై హక్కులను కాపాడుకుంటాం. గోదావరి నదిపై ప్రాజెక్టులను పూర్తి చేసుకుని ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసుకోవాలి. అనవసరమైన వివాదాలు, గందరగోళపరిచే విమర్శల వల్ల ప్రయోజనం లేదు. సమైక్య పాలనలో తెలంగాణ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. తెలంగాణ ఏర్పడినప్పుడు నీళ్లు, నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ విధానపరమైన లోపాలు, ఆలోచనల కారణంగానో ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గడిచిన పదేళ్లలో చిత్తశుద్ధితో ప్రాజెక్టులను పూర్తి చేసి 967 టీఎంసీల నీటిని వినియోగంలోకి తెచ్చుకుని ఉంటే, వరద జలాలపైనా, వాటా నీటిని తరలించడానికి అవకాశం ఉండే. 2001 లో మొదలైన దేవాదుల రెండు దశాబ్దాలు దాటినా ఇంకా సాగుతూనే ఉంది. ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పుడు నిధుల సమస్య వచ్చింది. రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల భారం ఉండటం వల్ల అవసరమైన నిధులు విడుదల చేయాలంటే కొరత ఉంది. అందుకే సమీక్షించి వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇప్పటికే అంచనాలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు. ఈ విధానానికి ముగింపు పలకాలి. సవరించిన అంచనాలను సవరించి మంత్రివర్గం ఆమోదంతో పనులను వెంటనే పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. తుమ్మడిహెట్టి నుంచి భద్రాచలం



వరకు ఉన్న అన్ని ప్రాజెక్టులపైన పూర్తిస్థాయి సమీక్ష చేసి వాటిని పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తాం. కాళేశ్వరం నుంచి చుక్కనీటిని ఎత్తిపోయకుండానే తెలంగాణలో అత్యధిక దిగుబడి సాధించాం. గోదావరి, కృష్ణా జలాలపై పక్క రాష్ట్రానికి తరలించడానికి సహకరిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆరోపణలు సరికాదు. గోదావరి నదీ జలాలపై శాసనసభలో చర్చ చేద్దాం. సూచనలు ఇవ్వండి. చవకబారు ఆరోపణలతో ప్రయోజనం లేదు. తెలంగాణ గౌరవాన్ని దెబ్బతీయొద్దు. ప్రతిపక్షం ఇచ్చే మంచి సూచనలను స్వీకరిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు తెలంగాణ ప్రజల ఆస్తి. గాలికి వదిలేయం. ప్రజలకు ఉపయోగపడేలా చేస్తాం. బ్యారేజీలకు సంబంధించి ఆనకట్టలకు సంబంధించి భూమి లోపల ఏమైనా సమస్యలున్నాయా అన్న కోణంలో కూడా విశ్లేషణలు జరగాలి. ఆ ప్రాజెక్టు భవిష్యత్తులో ప్రమాదకరంగా మారకూడదన్న ఆలోచనతో ఉన్నాం. ఆ తర్వాత ఆ బ్యారేజీలను పునరుద్ధరిస్తాం..” అని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మేడారం శ్రీ సమ్మక్క - సారలమ్మ మహాజాతర బ్రహ్మాండంగా సాగిందని అన్నారు. దక్షిణ కుంభమేళా తరహాలో జాతర జరిగిందని పేర్కొంటూ, మేడారం అభివృద్ధికి సంబంధించి భక్తులు నిరంతరం సందర్శించేలా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల తర్వాత మరోసారి మేడారం సందర్శించి సమీక్షిస్తానని చెప్పారు.

# దక్షిణాఫ్రికా చేతిలో టీమిండియా ఘోర పరాజయం

## 76 పరుగుల తేడాతో చిత్తు చేసిన దక్షిణాఫ్రికా

**మహా:** టీ20 ప్రపంచకప్ 2026 సూపర్ 8 పోరులో టీమిండియాకు ఘోర పరాజయం ఎదురైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 76 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తుగా ఓడించింది. తొలుత బ్యాటింగ్‌లో, ఆ తర్వాత బౌలింగ్‌లో సమష్టిగా రాణించిన సఫారీ జట్టు.. టీమిండియాను అన్ని విభాగాల్లోనూ దెబ్బతీసి అద్భుత విజయాన్ని అందుకుంది. 188 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఇషాన్ కిషన్ (0) డకౌట్‌గా వెనుదిరగగా, ఆ వెంటనే తిలక్ వర్మ (1) కూడా పెవిలియన్ చేరాడు. దీంతో 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో అభిషేక్ శర్మ (15), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (18) కాసేపు నిలదొక్కుకునే ప్రయత్నం చేసినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. వాషింగ్టన్ సుందర్ (11) కూడా విఫలమయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, ఆల్‌రౌండర్ శివమ్ దూబే (37 బంతుల్లో 42) ఒంటరి పోరాటం చేశాడు. అయితే అతనికి హార్దిక్ పాండ్యా (18) మినహా మరెవరి నుంచీ సహకారం అందలేదు. రింకూ సింగ్ (0) డకౌట్ కావడం




జట్టును మరింత దెబ్బతీసింది. దీంతో భారత జట్టు 18.5 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌట్ అయింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్ 4 వికెట్లతో చెలరేగగా, కేశవ్ మహరాజ్ 3, కార్బిన్ బాష్ 2 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఆరంభంలో గట్టి షాక్ తగిలింది. జస్‌ప్రీత్ బుమ్రా అద్భుత బౌలింగ్‌తో క్వింటన్ డి కాక్ (6), ర్యాన్ రికెల్టన్ (7)లను ఔట్ చేయగా, అర్షదీప్ సింగ్ కెప్టెన్ మార్క్రమ్ (4)ను పెవిలియన్ పంపాడు. దీంతో సఫారీ జట్టు 20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో డెవాల్డ్ బ్రెవిస్ (45), డేవిడ్ మిల్లర్ (63) అద్భుత భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరూ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ముఖ్యంగా మిల్లర్ కేవలం 35 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో విధ్వంసం సృష్టించాడు. చివర్లో ట్రిస్టన్ స్టబ్స్ (24 బంతుల్లో 44 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 187 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 4 ఓవర్లలో కేవలం 15 పరుగులిచ్చి 3 వికెట్లతో అద్భుతంగా రాణించాడు. సూపర్ 8 దశలో భారత్ తన తదుపరి మ్యాచ్ ను ఈ నెల 26న జింబాబ్వేతో ఆడనుంది. ఈ మ్యాచ్ చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరగనుంది.

### ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ

# హైస్పీడ్ ఇంటర్నెట్

### ఏపీ సీఎం చంద్రబాబు

**అమరావతి, మహా:** రానున్న ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. టెక్నాలజీ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకెళ్లాలంటే డిజిటల్ కనెక్టివిటీ అత్యంత కీలకమని ఆయన అన్నారు. భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో కీలక సహకార ఒప్పందం కుదిరింది. సీఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. డిజిటల్ భారత్ నిధి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య కుదిరిన ఈ ఒప్పందంపై డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సంతకాలు చేశారు.

# ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్

### పెళ్లిని అధికారికంగా ప్రకటించిన విజయ్ దేవరకొండ, రష్మిక
### అభిమానులు సృష్టించిన 'విరోష్' అనే పేరు పెళ్లికి ఖరారు
### ఫిబ్రవరి 26న పెళ్లి, మార్చి 4న రిసెప్షన్ M

**మహా:** టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమ పెళ్లి కబురును అధికారికంగా ప్రకటించారు. ఎంతో కాలంగా వీరిద్దరి వివాహంపై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, తమ పెళ్లి వేడుకకు 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్' అని పేరు పెట్టినట్టు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ పేరును తమ అభిమానుల గౌరవార్థం పెట్టినట్టు చెప్పి వారికి ప్రత్యేకమైన గౌరవాన్ని ఇచ్చారు. తమ వివాహానికి ఈ పేరు పెట్టడం వెనుక ఉన్న కారణాన్ని ఈ జంట వివరించింది. 'విరోష్' అనే పేరును ఏ వెడ్డింగ్ ప్లానర్లు, కుటుంబ సభ్యులు సూచించలేదని, ఎన్నో ఏళ్ల క్రితం తమ అభిమానులు ప్రేమతో సృష్టించినదేనని తెలిపారు. తాము ఎలాంటి ప్రణాళికలు వేసుకోకముందే, అభిమానులు తమ బంధానికి ఓ అర్థం ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఓ ఉద్వేగభరితమైన నోట్‌ను పంచుకున్నారు. "మా ప్రియమైన వారికి, మేము ఎలాంటి ప్రణాళికలు వేసుకోకముందే, మా కోసం మేము ఏదీ ఎంచుకోకముందే.. మీరు అప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చేశారు. ఎంతో ప్రేమతో, మీరు మాకు ఒక పేరు ఇచ్చారు. మమ్మల్ని 'విరోష్' అని పిలిచారు. కాబట్టి ఈ రోజు నిండు మనసుతో, మా ఈ కలయికకు మీ గౌరవార్థం 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్' అని పేరు పెడుతున్నాం. మమ్మల్ని ఇంతగా ప్రేమించినందుకు ధన్యవాదాలు. మీరు ఎప్పటికీ మాలో భాగమే!" అని రాసుకొచ్చారు. ఇదిలా ఉండగా, ఇటీవలే విజయ్, రష్మికల పెళ్లి పత్రిక అంటూ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ పత్రిక ప్రకారం, ఈ జంట ఫిబ్రవరి 26న ఒక చిన్న, సన్నిహిత వేడుకలో వివాహం చేసుకోనున్నారు. ఆ తర్వాత మార్చి 4న హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్ జరగనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

# సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ 2026 భేష్

(మొదటిపేజీ తరువాయి)

శ్రమ, సహనంతో కూడకున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. అనేక కష్టాలు, అడ్డంకులను ఎదుర్కొంటూ సీఐఎస్ఎఫ్ బృందాలు 6,553 కిలోమీటర్ల మేరకు జాతీయ యాత్రను దిగ్విజయంగా ముగించుకుని గమ్యస్థానాన్ని చేరుకోవడం నిజంగా ప్రశంసనీయమన్నారు. ధైర్యం, ప్రజాసేవా భావనకు శక్తివంతమైన సందేశమని చెప్పారు. భారతదేశ తీరప్రాంతం వేల సంవత్సరాలుగా నాగరికత, వాణిజ్యం, సాంస్కృతిక పరస్పర మార్పిడికి కేంద్రంగా నిలిచిందన్నారు. గుజరాత్‌లోని ప్రాచీన నౌకాశ్రయాల నుండి గోవా సముద్ర తీరాల వరకు, కేరళ మత్స్యకార గ్రామాల నుండి సుందర్‌బన్‌ల మాంగ్రోవ్ అరణ్యాల వరకు మన తీరప్రాంతం భారతదేశ సమృద్ధిగల సముద్ర వారసత్వ కథను చెబుతోందన్నారు. ఈ సైక్లోథాన్ ద్వారా ఆ వారసత్వానికి తగిన గౌరవం ఇవ్వడమే కాకుండా దాన్ని రక్షించాల్సిన బాధ్యతను మరొక్కసారి పునరుద్ఘాటించిందని తెలిపారు.




కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో నిర్వహించిన “వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ 2026“ ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్, అడిషనల్ డైరెక్టర్ జనరల్స్ పద్మాకర్ ఎస్. రణపిసే, సుధీర్ కుమార్, విజయ్ ప్రకాశ్, ఐజీలు ఎస్. ఆర్. సర్వానన్, జోస్ మోహన్, మళయాల నటుడు జయసూర్య, అర్జున పురస్కార గ్రహీత ఐ. ఎం. విజయన్, భారతీయ బ్యాడ్మింటన్ కోచ్ జోయ్ టీ. ఆంటోనీ, మలయాళం నటి సుశ్రీ ప్రయాగ మార్టిన్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా CISFకు చెందిన రెండు బృందాల్లో ఒకటి తూర్పు తీరప్రాంతం నుండి, మరొకటి పడమటి తీరప్రాంతం నుండి సైక్లోథాన్ యాత్రను ప్రారంభించి తీరప్రాంతాలన్నీ తిరుగుతూ చివరికి కేరళలోని కొచ్చిలో కలవడాన్ని కేంద్ర మంత్రి ప్రస్తావిస్తూ ఈ కలయిక మన దేశ ఐక్యతకు, అఖండతకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ ప్రయాణంలో విభిన్నమైన భౌగోళిక పరిస్థితులను అధిగమించి విస్తారమైన దూరాలను అధిగమించి ప్రజలతో నేరుగా సంభాషించి అనుబంధాన్ని పెంచుకోవడం అభినందనీయమని చెప్పారు. సీఐఎస్ఎఫ్ వందే మాతరం తీరప్రాంత సైక్లోథాన్ 2026 యాత్ర కేవలం భారతదేశంలోని విశాలమైన తీరప్రాంతాల గుండా సాగడమే కాకుండా, దేశ ప్రజల హృదయాలను కూడా కలిపే గొప్ప కార్యంగా నిలిచిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ గ్రామ సశక్తీకరణ దృష్టికోణానికి అనుగుణంగా, ఈ సైక్లోథాన్ 52 తీరప్రాంత గ్రామాలను దత్తత తీసుకోవడం ద్వారా తీరప్రాంత సముదాయాలను జాతీయ భద్రత, అభివృద్ధి ప్రక్రియకు కేంద్ర బిందువుగా నిలిచిందని తెలిపారు. బలమైన సరిహద్దులు, సురక్షిత తీరాలు కేవలం భద్రతా దళాల వల్ల మాత్రమే కాదు, అవగాహన కలిగిన, శక్తివంతమైన, అప్రమత్తమైన పౌరుల వల్లే సాధ్యమవుతాయని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో, హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో భారత ప్రభుత్వం అంతర్జాతీయ నౌకాయాన, పోర్టు భద్రతా నిబంధనల ప్రకారం CISFకు ఒక గుర్తింపు పొందిన భద్రతా సంస్థగా కీలక బాధ్యతలను అప్పగించిందని, ఈ సైక్లోథాన్ ఆ నిబద్ధతకు ఒక శక్తివంతమైన ప్రతీకగా నిలుస్తోందని కొనియాడారు. ఈ సైక్లోథాన్ కేవలం శారీరక సామర్థ్య ప్రదర్శన మాత్రమే కాదని, మహిళా సాధికారతకు ఒక శక్తివంతమైన ప్రతీక అని కేంద్ర మంత్రి చెప్పారు. సీఐఎస్ఎఫ్‌కు చెందిన 130 మంది సైకిల్ యాత్రికుల్లో 65 మంది సైక్లిస్టులు అంటే 50 శాతం మహిళలే ఉండటం గొప్ప విషయమన్నారు. వీరంతా 6,553 కిలోమీటర్ల ఈ దుర్గమ తీరప్రాంత యాత్రను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా ప్రతి రంగంలోనూ మహిళలు దృఢంగా నిలబడగలరని నిరూపించారని చెప్పారు. ఈ సైక్లోథాన్ అందరికీ ప్రేరణగా నిలవడమే కాకుండా ప్రజలతో అనుబంధాన్ని పెంచుతూ, దేశ బలాన్ని పెంచే కొత్త కార్యక్రమాలను కొనసాగిస్తుందని చెప్పారు. CISF ‘వందే మాతరం తీరప్రాంత సైక్లోథాన్’ ఒక శాశ్వత సంప్రదాయంగా మారి——భారతదేశ తీరప్రాంత గౌరవాన్ని పెంచుతూ, వాటి రక్షకులను గౌరవిస్తూ, దేశమంతటిని సేవ మరియు దేశభక్తి అనే ఒకే దారంలో కట్టిపడేస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

### దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి సహా...
### మావోయిస్టు అగ్రనేతల

# లొంగుబాటు



(మొదటిపేజీ తరువాయి)

ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు మరణించారు. ఆ తర్వాత మావోయిస్టు పార్టీకి దేవీజీ సారథ్యం వహిస్తున్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ‘ఆపరేషన్ కగార్’ పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా జన జీవన స్రవంతిలో కలిసి.. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలంటూ మావోయిస్టులకు కేంద్రం పిలుపునిచ్చింది. దాంతో పలువురు మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. మరికొంత మంది ఎన్‌కౌంటర్‌లో మరణించారు. పలువురు మావోయిస్టులు అరెస్టయ్యారు. మరికొంత మంది ప్రభుత్వం ఎదుట లొంగిపోలేదు. మరోవైపు ఆపరేషన్ కగార్ కోసం నిర్దేశించుకున్న సమయం మరికొద్ది రోజుల్లో ముగియనుంది. అలాంటి వేళ.. మావోయిస్టుల కోసం వారి ప్రభావిత రాష్ట్రాల్లో భద్రత బలగాలు.. జల్లెడ పడుతున్నాయి. దీంతో మధ్యప్రదేశ్ నుంచి తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టలోకి మావోయిస్టుల అగ్రనేతలు దేవ్ జీతోపాటు పలువురి నేతలు ప్రవేశించారంటూ నిఘా వర్గాల నుంచి కేంద్ర భద్రతా బలగాలకు సమాచారం అందింది. దాంతో కర్రెగుట్టలో ఇటీవల జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మరణించారు. వీరిలో అగ్రనేతలు ఉన్నారంటూ చర్చ జరిగింది. దేవ్ జీ లక్ష్యంగా కర్రెగుట్టల్లో కూబింగ్ నిర్వహించారంటూ ఈ ఎన్‌కౌంటర్ సమయంలో ప్రచారం జరిగింది.

# డీఎంకేకు సీట్ల చిక్కులు

(మొదటిపేజీ తరువాయి)

ఈసారి కూటమిలోకి కమల్ హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీ వచ్చి చేరింది. ఇప్పటికే మిత్రపక్షాలు తాము కోరుకుంటున్న స్థానాలతో కూడిన జాబితాను డీఎంకేకు అందించినట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సింగిల్ డిపాజిట్‌కు పరిమితమైన తాము ఈసారి డబుల్ డిజిట్ సీట్లను కోరుకుంటున్నామని కమ్యూనిస్టు పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఎక్కువ సీట్లను ఆశిస్తోంది. డీఎండీకే పార్టీకి ఆరు నుంచి ఎనిమిది సీట్లు ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కమల్ హాసన్ ఎంఎన్ఎం పార్టీ 2024 లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయకుండా డీఎంకే కూటమికి మద్దతు ఇచ్చింది. ప్రతిగా కమల్ హాసన్ రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఈ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసింది. ఇప్పుడు డీఎంకే కూటమిలో చేరిన కమల్ హాసన్, తగిన సమయంలో తన పార్టీకి ఎన్ని సీట్లు కావాలో చెబుతానని ఇదివరకు ప్రకటించారు. అయితే డీఎంకే మాత్రం గత అసెంబ్లీలో పోటీ చేసిన స్థానాల కంటే తమకు తగ్గకూడదని కోరుకుంటోంది.

# ఇరిగేషన్ బడ్జెట్ రూ.45వేల కోట్లకు తగ్గింపు

### బడ్జెట్ పై ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క సమీక్షలు

**హైదరాబాద్, మహా:** 202627 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ పై కసరత్తు కొనసాగుతోంది. అన్ని శాఖలు సమర్పించిన ప్రతిపాదనలపై ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ భట్టివిక్రమార్క సమీక్ష నిర్వహిస్తున్నారు. ఆయా శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమై అవసరాలు, నిధుల కేటాయింపు సంబంధిత అంశాలపై చర్చిస్తున్నారు. వచ్చే ఏడాదికి నీటిపారుదలశాఖకి ఏకంగా రూ.80 వేల కోట్లు అవసరమవుతాయని తొలుత చీఫ్ ఇంజనీర్లు ప్రతిపాదించారు. ఆ మొత్తాన్ని ఇంజనీర్ ఇన్‌చీఫ్ స్థాయిలో రూ.45 వేల కోట్లకు కుదించారు. 2026 27లో ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులు వాటి వివరాలను ఆర్థిక శాఖకు అందించారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని తగిన మేర నిధుల కేటాయింపులు చేస్తామని నీటిపారుదల శాఖకు కచ్చితంగా ప్రాధాన్యంఉంటుందని ఆర్థిక శాఖ అధికారులు హామీఇచ్చారు. కనీసం రూ.39 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. అందులో రూ.15 వేల కోట్ల వరకు గతంలో కార్పొరేషన్ల పేరిట




తీసుకున్న రుణాలకి వెళ్తాయని మిగిలిన రూ.24 వేల కోట్లు ప్రాజెక్టు పనుల పూర్తి, అందుకు అవసరమయ్యే భూసేకరణకి వినియోగించవచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రాజెక్టు పనుల కోసం ఇప్పటివరకు రూ.7,900 కోట్లకు పైగా నిధులిచ్చినట్లు సమాచారం. సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణకు ప్రతినెలా వెయ్యి, పనుల కోసం ప్రతినెలా రూ.1200 కోట్లు ఇస్తామని గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు నీటిపారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. అందుకు అనుగుణంగా ప్రాజెక్టుల పనులు, భూసేకరణ కోసం బడ్జెట్లో రూ.24 వేల కోట్లు పొందుపరచాలని అంటున్నారు.



# తెలంగాణ ఆత్మను చాటిన గాడ్స్ ఇన్ ది వాయిస్

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఒగ్గు కథ ఇంగ్లిష్ డాక్యుమెంటరీ ట్రైలర్ రిలీజ్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఒగ్గు కథను ప్రపంచానికి చాటేలా, తెలంగాణ ఆత్మను ఆవిష్కరించేలా ‘‘గాడ్స్ ఇన్ ది వాయిస్’’ డాక్యుమెంటరీ కల్చర్ ఫిల్మ్ రూపొందించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో డాక్టర్ జి. కుమారస్వామి దర్శకత్వంలో రూపొందుతున్న ‘‘గాడ్స్ ఇన్ ది వాయిస్’’ టీజర్ ను కవిత లాంచ్ చేశారు. తెలంగాణ ఒగ్గు కథను అద్భుతమైన డాక్యుమెంటరీగా తెరకెక్కిస్తున్న కుమారస్వామితో పాటు మూవీ టీమ్ ను అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, మూవీ యూనిట్ సభ్యులు ప్రొఫెసర్ జోలి పోతుసెర్రి, మేఘా యాదవ్, మహేశ్వర్, జయదేవ్ యాదవ్, సాయి రుద్రకాంత్, తిరుపతి యాదవ్, కవిత యాదవ్, రాజ్ కుమార్, శ్రీణిక, గనికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి, ఆయన తనయుడికి నోటీసులు జారీ..!

(మొదటిపేజీ తరువాయి)

నమోదయ్యాయి. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్లో కేసులు నమోదు చేసిన పోలీసులు, ఆదివారం నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విలేకరులతో మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 19వ వార్డు సభ్యులు ఆకుల యాదగిరిని మాజీ ఎమ్మెల్యే, ఆయన తనయుడు గత వారం రోజుల క్రింద కిడ్నాప్ చేసి తన మొబైల్ ఫోన్, కౌన్సిలర్ గా గెలిచిన ధ్రువ పత్రాని తీసుకోని మానసికంగా చిత్రహింసలకు గురి చేశారని, ఆకుల యాదగిరి భార్య, ఆయన కొడుకు రాష్ట్ర హైకోర్టులో కేసు వేయడంతో, కోర్టు ఆదేశాల మేరకు విచారణలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, ఆయన కుమారుడిపై పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డిలు వారి స్వగృహాలైన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని, ఎలిమినేడు



గ్రామంలో, నగరంలో తిరుమల హిల్స్ లోని ఇళ్ళలో వారు లేకపోవడంతో, రెండు చోట్ల ఇంటి గోడలకు నోటీసులు అంటించినట్లు పోలీసులు వెల్లడించారు. కిడ్నాప్ గురైన సంఘటనపై మూడు రోజులలో తిరిగి వివరణ ఇవ్వకుంటే న్యాయ స్థానం దేశాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని, నోటీసులో పొందుపరిచినట్లు పోలీసులు హెచ్చరించారు.

# డిజిటల్ మోసాలపై అప్రమత్తత అవసరం

### మన్ కీ బాత్ లో దేశ ప్రజలకు ప్రధాని మోదీ కీలక హెచ్చరిక

(మొదటిపేజీ తరువాయి)

తాజాగా ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ డిజిటల్ మోసాలపైన ప్రజలను అప్రమత్తం చేశారు.

**డిజిటల్ అరెస్ట్ పై ప్రధాని మోదీ వ్యాఖ్యలు**

ప్రధానమంత్రి మన్ కి బాత్ కార్యక్రమంలో డిజిటల్ అరెస్ట్ గురించి మరోసారి ప్రస్తావించారు. డిజిటల్ అరెస్ట్, డిజిటల్ మోసాలపై సమాజంలో ఇప్పటికే చాలా అవగాహన వచ్చిందన్నారు. అయితే ఇటువంటి సంఘటనలు ఇప్పటికీ మన చుట్టూ జరుగుతున్నాయన్నారు. ఇవి క్షమించరానివని, డిజిటల్ అరెస్టుకు, ఆర్థిక మోసానికి అమాయకులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా, అవగాహనతో ఉండటం చాలా ముఖ్యమన్నారు. కేవైసీ పట్ల అప్రమత్తంగా ఉండాలన్న ప్రధాని మోదీ. బ్యాంకు లావాదేవీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, కేవైసీ నో యువర్ కస్టమర్ పట్ల



అప్రమత్తత అత్యంత ముఖ్యమైన అంశమని ప్రధాన మంత్రి మోదీ తెలిపారు. ఈ ప్రక్రియ అందరికీ తెలిసినప్పటికీ అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాన్నారు. బ్యాంక్ ఖాతా సురక్షితంగా ఉండేలా బ్యాంకులు ఎప్పటికప్పుడు తిరిగి కేవైసీ నిర్వహిస్తాయన్నారు.

**కేవైసీ పేరుతో సైబర్ మోసాలు .. జాగ్రత్త**

ఇదే అవకాశంగా నేరస్థులు నకిలీ కాల్స్ చేస్తారని, ఎస్ ఎం ఎస్, లింకులను పంపుతారని, అలాంటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మీకు వచ్చే మెసేజ్ లను నమ్మొద్దని, అనుమానం ఉంటే నేరుగా బ్యాంకుకే వెళ్లి నిర్ధారించుకోవాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సందేశాన్ని గమనించి,. కేవైసీని నవీకరించుకోవాలన్నారు. కేవలం బ్యాంక్ యాప్స్ లేదా బ్రాంచ్‌ల ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. పాస్‌వర్డ్స్ తరచూ మారుస్తూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఒకే పాస్ వర్డ్ చాలా కాలం పాటు ఉంచకుండా పాస్‌వర్డ్‌లు తరచూ మారుస్తూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలలో అప్రమత్తతే అన్నిటి కన్నా ముఖ్యమని, కనుక ప్రజలు డిజిటల్ మోసాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అప్రమత్తంగా లేకుంటే మీ కష్టార్జితం సైబర్ నేరగాళ్ళ పాలు అయ్యే ప్రమాదం ఉంటుందని ప్రధాని మోదీ హెచ్చరించారు.

# కబ్జాలను తొలగించిన హైడ్రా

**ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి సన్నాహం.. జై కొట్టిన జనం**

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం అక్కడ ప్రభుత్వ కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ పరిణామాలను చూసి కొండాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు ప్రభుత్వానికి జై కొట్టారు. హైడ్రాను అభినందనలతో ముంచెత్తారు. దశాబ్దాల సమస్యకు రోజుల్లో.. గంటల్లో పరిష్కారం దొరకడం.. కబ్జాలను తొలగించి హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన వెంటనే.. ప్రభుత్వం అక్కడ విద్యా సంస్థల ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదివారం పర్యటించినప్పుడు కొండాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చి హైడ్రా చర్యలను అభినందించారు. హైడ్రా కాపాడిన స్థలంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటుకు విద్యా శాఖ ఆదివారమే సర్వే చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమౌతోంది.

**ఆక్రమణలను హైడ్రా తొలగించిన వెంటనే**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ విలేజ్‌లోని సర్వే నంబరు 78 నుంచి 93 లో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 2059 ప్లాట్లతో 1993లో గ్రామపంచాయతీ లే ఔట్ వేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు కేటాయించారు. అలాగే పాఠశాలకు దాదాపు ఎకరా స్థలం, పార్కుల కోసం ఎకరాకు పైగా కేటాయించారు. కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాల స్థలాన్ని ఉంచారు. ఇలా కేటాయించిన భూముల ఆక్రమణలకు గురౌతున్నాయని వెంటనే కాపాడి రాజరాజేశ్వరి నగర్‌లో నివాసం ఉంటున్న 5 వేల కుటుంబాలకు ఉపయోగపడేలా చూడాలని హైడ్రా ప్రజావాణిలో కాలనీ సంక్షేమ సంఘం కోరింది. ఈ భూముల ఆక్రమణల వెనక బదలాయింపులున్నాయని ఫిర్యాదు చేసింది. లే ఔట్ ప్రకారం కబ్జాలను కనిపెట్టి తొలగించింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన, హైడ్రా ఏసీపీ శ్రీకాంత్, హైడ్రా డిప్యూటీ టౌన్ ప్లానర్ రామిరెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు ఆదివారం కొండాపూర్‌లో పర్యటించి పరిశీలించారు. వెంటనే అక్కడ ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయడానికి విద్యా శాఖ అధికారులు ప్రభుత్వ కళాశాల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు.

**పార్కులు, విద్యా సంస్థలు**

కొండాపూర్‌లోని రాజరాజేశ్వరి నగర్ కాలనీలో పార్కులకు ఉద్దేశించిన స్థలంలో పార్కు నిర్మాణానికి, పాఠశాలలకు ఉద్దేశించిన స్థలంలో పాఠశాల, కళాశాలకు ఉద్దేశించిన స్థలంలో కళాశాలతో పాటు పలు విద్యా సంస్థలు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు అక్కడి స్థానికులకు చెప్పారు.. వారి ఆనందానికి అవధుల్లేవు. దశాబ్దాల పోరాటం ఫలించిందంటూ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ పార్కులు, విద్యాసంస్థల ప్రారంభించడానికి చర్యలు తీసుకోవడం అభినందనీయమని రాజరాజేశ్వరి నగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ పేర్కొంది. పలువురు అధికారులను కలిసి అభినందనలు తెలిపారు.

# అధ్వానంగా మణుగూరు- ఇ బయ్యారం క్రాస్ రోడ్..

- **తక్షణమే రోడ్డు మరమ్మతులు, లైటింగ్ ఏర్పాటు చేయాలని..**
- **ఎమ్మెల్యే పాయంకు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ వినతి..**



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఇఫ్ట్ మధు

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం నుంచి ఇ బయ్యారం క్రాస్ రోడ్ వరకు ఉన్న రహదారిని తక్షణమే మరమ్మతులు చేసి, వీధి దీపాలు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు, దుమ్ము-ధూళి సమస్యలను నివారించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరు నుంచి ఇ బయ్యారం క్రాస్ రోడ్ వరకు రహదారిపై బొగ్గు టిప్పర్లు, ఇసుక లోడుతో ఉన్న లారీలు తదితర భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ, పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని, మరికొందరు గాయాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు డ్యామేజ్ అయిన ప్రాంతాల్లో బీటీ ప్యాచ్‌వర్క్ చేయాల్సి ఉండగా, దుబ్బ, యాష్, కంకర పోయడంతో వాహనాలు వెళ్లే సమయంలో విపరీతమైన దుమ్ము లేస్తోందని ఆరోపించారు. దుమ్ము కారణంగా ఆ మార్గంలో ప్రయాణించలేని పరిస్థితి నెలకొన్నదని, స్థానిక ప్రజలు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాలను, ప్రాణాలను కాపాడాలంటే తక్షణ చర్యలు అవసరమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ఆర్ అండ్ బి అధికారులకు ఫోన్ చేసి రోడ్డు మరమ్మతులు వెంటనే ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా సాంబాయిగూడెం గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలతో పాటు ఇతర స్థానిక సమస్యలను కూడా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఇచ్చిన హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేసి, ప్రజల ఇబ్బందులకు ముగింపు పలకాలన్నారు.

# మణుగూరులో ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రారంభం

- **శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన సిఐ నాగబాబు**
- **యువతకు డిజిటల్ దిశగా అడుగు**



ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ నాగబాబు

**మణుగూరు, మహా :** ఆధునిక సాంకేతిక యుగానికి అనుగుణంగా స్థానిక యువతను తీర్చిదిద్దే లక్ష్యంతో మణుగూరు పట్టణంలోని గుట్ట మల్లారం ప్రాంతంలో ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని మణుగూరు సిఐ నాగబాబు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సిఐ నాగబాబు, ఎస్సై నగేష్ కుమార్ సమక్షంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ యువతలో డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం ద్వారా యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ నాగబాబు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో కంప్యూటర్ విద్య అనివార్యమైందని, గ్రామీణ ప్రాంత యువత కూడా సాంకేతిక రంగంలో ముందుకు రావాలంటే ఇటువంటి శిక్షణా కేంద్రాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ఎస్సై నగేష్ కుమార్ మాట్లాడుతూ.. కంప్యూటర్ శిక్షణను క్రమశిక్షణతో పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శిక్షణా కేంద్రం ద్వారా అనేక మంది యువకులు, యువతులు ప్రయోజనం పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్వాహకుల ఈ చొరవను పలువురు అభినందించారు.

# కారేపల్లి ఐకేపీలో కోటిన్నర కాజేశారు..

- **కుంభకోణంలో గ్రామ దీపికలు సూత్రధారులు**
- **అప్పటి ఐకేపీ అధికారుల అండతోనే అక్రమం**
- **ఆర్ఆర్ యాక్టుతో జప్తులకు సిద్ధమవుతున్న ఆఫీసర్లు**




**కారేపల్లి, మహా:** కారేపల్లి ఐకేపీ లో మోట్ల గూడెం తరహాలో అనేక గ్రామాల్లో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. మండలంలోని పేరుపల్లి, మాదారం, పోలంపల్లి గ్రామాల్లో కోటిన్నర కుంభకోణం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. ఐకెపి కార్యాలయం మొండి బకాయిగా చూపిస్తున్న సుమారు కోటిన్నర రూపాయలు వాస్తవంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఎగ్గొట్టిన సొమ్ము కాదు. గతంలో ఇక్కడ పని చేసిన కొందరు ఐకెపి అధికారులు స్థానికంగా ఉండే గ్రామ దీపికలు కుమ్మక్కై భారీ అక్రమానికి పాల్పడ్డారు. ఈ మూడు గ్రామాల్లోనే వివిధ సంఘాల్లో సీఐఎఫ్, స్త్రీ నిధి రుణాల పేరుతో గ్రామ దీపికలు కొందరి సభ్యుల పేర్లతో బ్యాంకుల్లో భారీగా రుణాలు తీసుకొని వాటిని ఐకెపి అధికారులతో కలిసి అక్రమంగా వాడుకున్నారు. రుణం వచ్చిన సమయంలో వారికి సంబంధించిన సభ్యులకు ఎంతో కొంత ముట్ట జెప్పి మిగతా డబ్బును తీసుకుని ఈ డబ్బంతా మేమే తిరిగి చెల్లిస్తామని నమ్మబలికి కట్టకుండా వదిలేశారు. దీంతో ఈ గ్రూపులకు ఇచ్చినవన్నీ మొండి బకాయిల కింద నమోదయ్యాయి. వీటన్నిటిని రికవరీ చేసేందుకు అధికారులు ఆర్ఆర్ యాక్టు ను ప్రయోగించి జప్తులు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. కారేపల్లి ఐకెపి కార్యాలయ కేంద్రంగా గతంలో జరిగిన లావాదేవీలన్నింటిపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తే కొట్లాది రూపాయల కుంభకోణం వెలుగులోకి వస్తుంది.

**మోట్లగూడెం అక్రమంపై చర్యలు తప్పవు...**

మండలంలోని మోట్లగూడెం స్వరాజ్, వినాయక్ గ్రూపుల పేరుతో జరిగిన అక్రమంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కారేపల్లి ఐకెపి ఎపిఎం పిడమర్తి వెంకటేశ్వర్లు తెలిపారు. మహాలో వచ్చిన కథనంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# కోట్ల విలువైన సుబాబుల్ కలప అక్రమంగా తరలిపోతోంది

- **సీతారామ ప్రాజెక్టుకు భూసేకరణలో భూములు తీసుకున్నారు...**
- **తీసుకున్న భూముల్లో కలపను అక్రమంగా తరలిస్తున్నారు**
- **టెండర్ లేకుండా నే కాంట్రాక్టర్ రంగంలోకి..**
- **కాంట్రాక్టర్లు, ఇరిగేషన్ అధికారులు కుమ్మక్కయ్యారా?**
- **సీఎం పెద్దమ్మ కొడుకు ఈ కాంట్రాక్టు తీసుకున్నాడని సబ్ కాంట్రాక్టర్ ప్రచారం**
- **సీఎం బంధువు పేరు చెప్పి ముఖ్యమంత్రిని బదనాం చేస్తున్న అక్రమార్కులు...**



**కారేపల్లి, మహా:** సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనుల కోసం ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో రైతుల నుంచి భూ సేకరణ చేసిన అధికారులు ఆ భూముల్లో ఉన్న సుబాబుల కర్ర విషయంలో నిబంధనలు పాటించకపోవడంతో కోట్ల విలువైన కలప అక్రమంగా తరలిపోతుందని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆస్తులను ఏది విక్రయించాలన్నా అనేక పద్ధతులను పాటించే అధికారులు విలువైన కలప విషయంలో బహిరంగ వేలం కానీ, ఈ టెండర్లు కానీ పిలవకుండా పెద్ద తలకాయల ఒత్తిళ్లతో కొందరు కాంట్రాక్టర్లు, సీతారామ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కై కోట్ల సంపదను అక్రమంగా దోచుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**సీతారామ ప్రాజెక్టుకు 168 ఎకరాలు...**

సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం కారేపల్లి మండలంలోని బాజు మల్లాయిగూడెం, రేలకాయలపల్లి రెవిన్యూ గ్రామాల రైతుల నుంచి ప్రభుత్వం 168 ఎకరాల భూమిని సేకరించింది. రైతులకు పరిహారం కూడా చెల్లించింది. ఈ భూముల్లో 100 ఎకరాలకు పైబడి రైతులు సుబాబుల పంటను సాగు చేశారు. ఈ పంట కూడా కటింగ్ కు వచ్చింది. రైతుల పంటకు కూడా ప్రభుత్వం పరిహారం చెల్లించి భూములను స్వాధీనం చేసుకుంది. పరిహారం చెల్లించిన వెంటనే కాల్వ పనులు కూడా ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సుబాబుల పంటను కాంట్రాక్టర్కు అప్పగించే తీరులో నిబంధనలను ఏమాత్రం పాటించలేదు. నిబంధనలకు విరుద్ధంగా కోటి రూపాయలు విలువైన 50 లోళ్ళ సుబాబులు ఇప్పటికే అక్రమంగా తరలిపోయింది.

**సబ్ కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో అక్రమ తరలింపు...**

చీమలపాడు కు చెందిన ఓ సబ్ కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో ఈ కలప అక్రమ తరలింపు వ్యవహారం యదేచ్చగా సాగుతోంది. ఇంజనీరింగ్ అధికారులతో కుమ్మక్కై అక్రమంగా కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి స్థానికంగా ఉండే ఓ పలుకుబడి కలిగిన వ్యక్తిని సబ్ కాంట్రాక్టు గా నియమించుకుని అక్రమానికి తెరలేపారు.

**సీఎం పెద్దమ్మ కొడుకు కాంట్రాక్టర్ అని ప్రచారం...**

సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనులను సీఎం పెద్దమ్మ కొడుకు కాంట్రాక్టర్ గా వ్యవహరిస్తున్నారని స్థానికంగా ఉండే సబ్ కాంట్రాక్టర్ ప్రచారం మొదలుపెట్టాడు. సీఎం బంధువు కాంట్రాక్టర్ కాబట్టి రైతులకు పరిహారం కూడా వెంటనే వచ్చాయని, ఈ పనులు కూడా స్పీడ్ గా జరుగుతున్నాయని ప్రచారం చేస్తూ సబ్ కాంట్రాక్టర్ తన అక్రమ కార్యకలాపాలను రాత్రింబవళ్లు కొనసాగిస్తున్నాడు. అక్రమాలకు పాల్పడే ఈ ముఠా సీఎం పేరును కూడా బదనాం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆ ప్రాంత కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రైతుల కష్టం దళారుల పాలు...**

సీతారామ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారు ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరావు ను కలిసి వారి ప్రాంతంలో జరుగుతున్న అక్రమాన్ని వివరించారు. కష్టపడి పండించిన పంటను అక్రమంగా దళారులు దోచుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూములకు కూడా తక్కువ రేట్ కట్టించారు, పంటకు కూడా ఆశించిన రేటు కట్టించలేదు కాబట్టి ఉన్న పంటను మాకే దక్కే విధంగా అవకాశం కల్పించమని మంత్రి తుమ్మలను రైతులు కోరారు. మంత్రి తుమ్మల కూడా ఈ విషయంపై కలెక్టర్ తో మాట్లాడినట్లు సమాచారం...

**నిబంధనల విషయం దాటేస్తున్న అధికారులు...**

సుబాబుల కలపను తరలించడానికి ఎలాంటి నిబంధనలు పాటించాలననే విషయం మీద సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఫోన్లో సమాచారం తెలుసుకునేందుకు ప్రయత్నించగా దాటవేస్తున్నారు. సీతారామ ప్రాజెక్ట్ డీఈ కి ఫోన్ చేయగా దీనికి సంబంధించి ఈఈ దగ్గర సమాచారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఈ కి ఫోన్ చేయగా డీఈ దగ్గరే సమాచారం ఉంటుందని తప్పుకుంటున్నారు తప్ప ఈ కలప తరలింపు విషయంపై ఎటువంటి నిబంధనలు పాటించారో స్పష్టం చేయకుండా దాట వేస్తున్నారు.

# జార్ఖండ్ తరహాలో ఉద్యమకారులకు పెన్షన్ ఇవ్వాలి



**నేలకొండపల్లి, మహా:** తెలంగాణ ఉద్యమకారులకు జార్ఖండ్ తరహా లో పెన్షన్ రూ.25 వేల ను చెల్లించాలని ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలం లోని కొత్తకొత్తూరు లో ఆదివారం ఉద్యమకారుల జేఏసీ సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక ఉద్యమాలు చేపట్టిన వారిని గుర్తించాలని కోరారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పోరేషన్ ను ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యమంలో పాల్గొన్న వారికి తామర పత్రం ను అందించాలని కోరారు. ..ఎన్నికల సమయంలో ఇస్తానన్న హామీలను అమలు చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణం, ఉచిత రైలు, బస్సు, ఆరోగ్య భీమా, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల ను గుర్తించి ప్రభుత్వం చిత్తశుద్ధి ని నిరూపించుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం కు ఉద్యమకారులు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు కాకామాను మల్లిఖార్జునావు, వడ్డె జగన్, మేకల వెంకటేశ్వర్లు, మండడి వెంకటేశ్వర్లు, తీగ రాములు, జీ.ఆంజనేయులు, కట్టెకోల వెంకటేశ్వర్లు, మానుకొండ శ్రీనివాసరావు, బోయిన రామనాథం తదితరులు పాల్గొన్నారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి

# సింగరేణి సంపూర్ణ సహకారం






- **సింగరేణి జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ సెక్యూరిటీ జివి.కిరణ్ కుమార్**
- **చిల్డ్రన్స్ పార్కులో ఘనంగా "వరల్డ్ థింకింగ్ డే"**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భావి భారత పౌరులను తీర్చిదిద్దే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి సింగరేణి సంపూర్ణ సహకారం అందిస్తుందని. సింగరేణి జిఎం (పర్సనల్)వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ సెక్యూరిటీ జివి.కిరణ్ కుమార్ అన్నారు. స్కౌట్స్ ఉద్యమ స్థాపకుడు బేడెన్ పవల్ జన్మదినాన్ని పురస్కరించుకొని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ లో ఆదివారం "వరల్డ్ థింకింగ్ డే" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిఎం (పర్సనల్) వెల్ఫేర్ జివి.కిరణ్ కుమార్ హాజరై భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకావిష్కరణ చేయడం జరిగింది. అనంతరం సర్వ సమ్మత ప్రార్ధన నిర్వహించి బేడెన్ పవల్ విగ్రహానికి అతిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం స్కౌట్స్ ఉద్యమ స్థాపకుడు బేడెన్ పవల్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 22వ తేదీన "వరల్డ్ థింకింగ్ డే" కార్యక్రమాన్ని సింగరేణి సంస్థ వ్యాప్తంగా అన్ని ఏరియాలలో ఘనంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నందు స్కౌట్స్ విద్యార్థులకు దేశ భక్తి నాయకత్వ లక్షణాలు విపత్తుల సమయంలో ధైర్యముగా ముందుకు వెళ్ళి సేవ చేసే విధముగా మొత్తంగా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం అలవరచుకునేలా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం దోహద పడుతుందని వివరించారు. అందుకే యువతను మరింతగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంలో భాగస్వామ్యం చేయాలని ఇందుకు సింగరేణి యాజమాన్యం ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించి ప్రోత్సహిస్తుందన్నారు. కులమతాలకు అతీతంగా సహజీవనాన్ని అలవరిచేదే స్కౌట్స్ అండ్ గైడ్స్ అని మనకు వచ్చే మంచి ఆలోచనలను ఆచరణలో పెట్టినప్పుడే మానవజన్మకు సార్ధకత లభిస్తుందని ఈ ప్రపంచ ఆలోచనా దినోత్సవం రోజున స్కౌట్స్‌గైడ్స్ ఈ దిశగా ప్రతిన బూనాలని అన్నారు. అదే విధముగా సమాజహిత కార్యక్రమాల నిర్వహణలో భాగంగా సింగరేణి రోవర్లు ఎన్నో సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారని అన్నారు. అనంతరం "ప్రపంచ శాంతి"ని కాంక్షిస్తూ చిల్డ్రన్స్ పార్క్ నుండి రైల్వే స్టేషన్ వరకు నిర్వహించిన ర్యాలీని జిఎం (పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ సెక్యూరిటీ అండ్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ జివి.కిరణ్ కుమార్ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన "అడ్వెంచర్ యాక్టివిటీస్" (సాహసోపేత కృత్యాలు), మంకీ క్రోల్, ఫీడింగ్ బాల్స్, రోప్ క్లైమ్బింగ్స్, టైర్ జంపింగ్ లలో స్కౌట్స్, గైడ్స్, కబ్స్, బుల్ బుల్స్ , రోవర్స్‌రేంజర్స్, ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవ రావు, సీనియర్ పిఓ అండ్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద్, యూనిట్ లీడర్లు, సింగరేణి ఎయిడెడ్ పాఠశాల, శారదా విద్యాలయం, సెంట్ జేవియర్ పాఠశాల, సింగరేణి మహిళా జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలకు చెందిన దాదాపు 145 మంది స్కౌట్స్ స్టూడెంట్స్, స్కౌట్ మాస్టర్స్, రోవర్ స్కౌట్ లీడర్స్ రోవర్స్ విద్యార్ధులు పాల్గొన్నారు.

# సింగరేణిలో కాళీ పోస్టుల భర్తీకి వ్రాతపరీక్ష

**నిఘా మధ్య పరీక్షలు విజయవంతం.. పర్యవేక్షించిన సింగరేణి అధికారులు**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఆసిస్టంట్ ఇంజనీర్(సివిల్) ఈ2గ్రేడ్ పోస్టులను అంతర్గత అభ్యర్ధులతో భర్తీ చేసే దానిలో భాగంగా ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ పీజి కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించటం జరిగింది. ఆసిస్టంట్ ఇంజనీర్(సివిల్) ఈ2గ్రేడ్ నాలుగు ఖాళీకు గాను అర్హులైన 126 మంది అభ్యర్ధులకు హాల్ టికెట్లు జారీ చేయగా 113 మంది అభ్యర్ధులు హాజరయ్యారు. ఈ వ్రాత పరీక్ష సెక్యూరిటీ విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణలో సిసి కెమెరాల నిఘా మధ్య నిర్వహించటం జరిగింది. సింగరేణి మహిళా డిగ్రీ పీజి కళాశాలలో జరిగిన ఈ పరీక్షను జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏ.జే.ఎం మురళీధరరావు, హెచ్‌ఓడి(విజిలెన్స్) పి.రాజీవ్ కుమార్ పర్యవేక్షించి పరీక్ష పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుందని దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు సింగరేణి వెబ్ సైట్, సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డుద్వారా తెలియజేయటం జరుగుతుందని తెలియజేశారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ జి.వి. కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏ.జే.ఎం మురళీధరరావు, హెచ్‌ఓడి(విజిలెన్స్)పి.రాజీవ్ కుమార్, డిజిఎం(పర్సనల్)పి.వేణుగోపాలరావు, డివైపిఎం డి.నాగేశ్వరరావు, డివై.మేనేజర్(ఐటి)ఎన్.చంద్ర శేఖర్, విజిలెన్స్ ఆఫీసర్లు కె.జగదీష్ కుమార్, కే.రామకృష్ణ, సీనియర్ పిఓ శ్రీ పి.కాంతారావు, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతా శారద, ఇతర అధికారులు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది, రిక్రూట్మెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తాం

**55వ డివిజన్ కార్పొరేటర్ మాజీ కౌన్సిలర్ కు ఘన సన్మానం**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 55వ డివిజన్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని కోతులు కుక్కలు పట్టివేతకు కార్పొరేషన్ కౌన్సిల్లో తీర్మానిస్తామని ఆ డివిజన్ కార్పొరేటర్ సింగర హరి హరన్ అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 55వ డివిజన్ కూలి లైన్ లో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ సింగర హరిహరన్ ను, మాజీ కౌన్సిలర్ సౌత్ సెంట్రల్ రైల్వే డి.ఆర్. యు సి.సి మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డిని శ్రీయుక్తి పేద ప్రాంత సమాఖ్య డ్వాక్రా సంఘాల సభ్యులు, అంగన్వాడి టీచర్స్ కలిసి ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింగర హరిహరన్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా సాధికారత కోసం డ్వాక్రా సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసం ఎంతగానో కృషి జరుగుతుందని చెప్పారు. 55వ డివిజన్ లో డ్వాక్రా సంఘాల సమావేశాలు వార్డు ప్రజల చిన్నచిన్న ఫంక్షన్స్, ప్రభుత్వ అధికారుల కార్యక్రమాల అమలు కోసం గతంలోనే 50 లక్షలు నిధులతో శంకుస్థాపన చేయబడి పెండింగ్లో ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మించడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ప్రజలను గాయ పరుస్తూ భయపెడుతున్న కోతులను కుక్కలను పూర్తిగా పట్టించడానికి, కార్పొరేషన్ కౌన్సిల్ తోపాటు జిల్లా కలెక్టర్ కమిషనర్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి, డివిజన్ అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్పి మీరాబాయి, ఓబీలు కాకటి లక్ష్మి, కమిటీ కార్ శోభ, లింగాలప్రమీల, చిప్పా లక్ష్మి, అంగన్వాడీ టీచర్స్ ప్రసన్న లక్ష్మి, రాధా, రజిని, పద్మ, డ్వాక్రా శ్రీయుక్తి పేద ప్రాంత సమాఖ్యసభ్యులు డివిజన్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ కవిగా వీరబాబుకు ఘన సన్మానం




**నేలకొండపల్లి, మహా:** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని అనాసాగారం గ్రామానికి చెందిన ప్రజా కవి, మాజీ సర్పంచ్ చిలకబత్తిని వీరబాబు ఘన సన్మానం పొందారు. ప్రపంచ తెలుగు కవుల దినోత్సవం సందర్భంగా విజయవాడ లో నిర్వహించిన సదస్సులో తన ప్రతిభ ను కనపరిచారు. దీంతో ఉత్తమ కవిగా నిర్వహాకులు ఘనంగా సన్మానించి అవార్డును అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఏపీ తెలుగు సాహిత్య అకాడమీ, సాంస్కృతిక చైర్మన్ ఆర్.డీ.విల్సన్, బాలా సాహిత్య వేత్త ఉమామహేశ్వరావు ల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత వీరబాబు మాట్లాడారు.... తనకు ఎన్నో అవార్డులు, సన్మానాలు జరిగినప్పటికీ, వెంకయ్య నాయుడు తన సాహిత్యం ను మెచ్చుకుని... భుజం తట్టి అభినందించటం చాలా సంతోషంగా ఉందన్నారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు స్ఫూర్తిదాయకం

**వరల్డ్ థింకింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహణ..**




జెండా ఊపి రాలీని ప్రారంభిస్తున్న ఎస్ఓ టు జిఎం

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పీవీ కాలనీ సింగరేణి పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వరల్డ్ థింకింగ్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఓ టు జీఎం బి శ్రీనివాస చారి వరల్డ్ స్కౌటింగ్ ఉద్యమ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్ పొవెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీఎం (పర్సనల్) ఎస్ రమేష్ విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై రాంగోపాల్, ప్రధానోపాధ్యాయురాలు ఆర్ కల్యాణి, గైడ్స్ టీచర్ బి సరిత ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్య అతిథి ఎస్ఓ టు జిఎం శ్రీనివాస చారి మాట్లాడుతూ.. యువతలో స్నేహభావం, సేవా దృక్పథం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాల పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. 2026 వరల్డ్ థింకింగ్ డే నినాదం మన స్నేహంను ఆచరణలో పెట్టాలని సూచించారు. 1926లో ప్రారంభమైన వరల్డ్ థింకింగ్ డే ఈ సంవత్సరం 100వ సంవత్సరాన్ని పూర్తి చేసుకోవడం విశేషమన్నారు. శతాబ్ద కాలంగా స్కౌటింగ్‌గైడింగ్ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా బాలవిద్య, నాయకత్వం, సేవాభావం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ మధ్య స్నేహబంధం, పరస్పర గౌరవం, సహకారం, ఐక్యత పెంపొందించి శాంతి, సామరస్యాలకు పాటుపడాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేర్పించి ప్రోత్సహించాలని కోరారు. సింగరేణి పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య గీతాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ముగింపులో నిర్వహించిన శాంతి యాత్ర ర్యాలీని బి శ్రీనివాస చారి జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల నుంచి కాలనీ వరకు సాగిన ర్యాలీలో అతిథులు, ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షకులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 23-02-2026



## భారతీయ ఆంగ్ల సాహిత్యంలో బహుముఖ
# వ్యంగ్య చిత్రం : నిస్సిమ్ ఎజెకిల్

విభిన్న ఇతివృత్తాలు,విలక్షణ అభివ్యక్తితో బహుముఖీన సాహితీ ప్రభలతో భారతీయ ఆంగ్ల సాహిత్యానికి మార్గదర్శిగా గుర్తింపు పొందిన గొప్ప భారతీయకవి నిస్సిమ్ ఎజెకిల్. భారతీయ దైనందిన జీవితంలోని ఖచ్చితమైన మాట మంతీ గొంతుల వ్యంగ్యం,సానుభూతి వంటి మానవీయ మనోవిశ్లేషణ ఆయన కవిత్వం చిరునామా. పట్టణ పరాయీకరణ, వలస రాజ్యాల అనంతర గుర్తింపు, వ్యంగ్యం సానుభూతి వాహకాల ఇతివృత్తాల రచనలతో ప్రఖ్యాతి గడించిన నిస్సిమ్ ఎజెకెల్ ప్రసిద్ధ భారతీయ ఆంగ్లకవి. నిస్సమ్ ఎజికిల్ లో ఆత్మవిశ్వాసం,పని పట్ల నిబద్ధత ఎక్కువే.అవి రెండు కళ్ళుగా సారించిన దృష్టి తాత్వికత గొప్పది.ఇది తన రచనల్లో ప్రతిబింబిస్తుంది కూడా. అనారోగ్యంతో చికిత్సకోసం బొంబాయి హాస్పిటల్ లో చేరారు కవిగారు.ఆ సందర్భంలో 'మీరు చాలా నీరసంగా ఉన్నారు,బెడ్ పై విశ్రాంతి చాలా అవసరం అనే ఒక నర్స్ మాటలు 'విన్న నిస్సిమ్,తనను పరామర్శించ వచ్చిన మిత్రులతో 'ఎవరైనా ఏ పనీపాట లేకుండా పొద్దస్తమానం విశ్రాంతి ఎలా తీసుకోగలరు' అంటారు హూందాగా.కవిత్వం తన ముందుకొస్తే ,శారీరక బాధను మరిపించే మెదడు ఉరకలేస్తుంది. అది నిస్సీమ్ కు కవిత్వంపట్ల గల కమిట్మెంట్. ఆయన ఆరోగ్యంపట్ల సృజన అంతర్లీన శక్తి ట్రీట్మెంట్ ప్రభావమే అది.ఒకింత సరదాగా ఉన్నా ఇష్టమైన పని ముందుంటే బాధలన్నీ ఎగిరిపోవునుగా!ఇక్కడ కవి ముకుసూటి తనంగల వాడు.అందుకే సాదాసీదాగా ఓపెన్ అవడం బేర్ ఫ్యాక్ట్. నిస్సీమ్ సాహితీ రచన బహుముఖీన విస్ఫోటనం.ఒక్క ప్రక్రియకాదు సాహిత్యం అంచులను చుట్టేసిన అన్ని జర్న్ఫ్ పట్టిచూసి రాసిన రచనలన్నీ, కవిత్వం, నాటకం, వచనం, విమర్శ, మాటా మంతీ, యాత్రా, కథ, వ్యాసావళి ఉల్లాసం, ఉత్సాహం పాఠకులకు అందించినవే.ఆయన తాత్వికత సత్యశోధన వేళ్ళుగా ఉంటుంది.నిస్సీమ్ సాహితీ రచన బహుముఖీన విస్ఫోటనం. ఒక ప్రక్రియ కాదు, ఆయన సాహిత్యం అంచులను చుట్టి జర్న్ఫ్ అన్ని రాసిన రచనలలో, కవిత్వం, నాటకం,వచనం,విమర్శ ,మాటా మంతీ, యాత్రా,కథ,వ్యాసావళి వంటివి ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని పాఠకులకు అందించినవే. ఆయన తాత్వికత సత్యశోధన వేళ్ళుగా ఉంటుంది. మనస్తత్వ చింతన పట్టణ వలసల చుట్టే తిరుగడం గమనించాలి. ఆకోవలోనిదే 'ఐలాండ్' కవిత కూడా. ఒక భారతీయ కవి, నటుడు, నాటక రచయిత, మరి సంపాదకుడు, కళా విమర్శకుడు కూడా.ఆయన వలసరాజ్యాల అనంతర భారతదేశ సాహిత్య చరిత్రలో, ముఖ్యంగా ఆంగ్లంలో భారతీయ కవిత్వానికి ఒక పునాదిరాయి. నిస్సిమ్ ఎజెకిల్ ఆధునిక భారతీయ ఆంగ్ల సాహిత్యంలో రాత్రిపూట తేలు(Night of the Scorpion), తరువాతి రోజు కీర్తనలు(Latter day Psalms) లెక్కింపదగిన కొన్ని. భారతీయ కేంద్ర సాహిత్య అకాడమీ ఆయన రాసిన 'తరువాతి రోజు కీర్తనలు' అనే సంకలనానికి 1983లో ప్రతిష్ఠాత్మక అకాడమీ అవార్డుతో గౌరవించింది. ఎజెకిల్ తన సూక్ష్మమైన, సంయమనంతో మరి చక్కగా వ్యక్తపరిచే డిక్షన్ కు ప్రశంసలు అందుకున్నాడు. సాధారణ మరింకా లౌకిక (రోజువారీ) ఇతివృత్తాలను అభివ్యక్తీకరించే విధంగా వ్యవహరించాడు.ఇది అభిజ్ఞా లోతును, అలాగే భావోద్వేగరహిత, వాస్తవిక సున్నితత్వాన్ని రెండింటినీ తెలుపుతుంది.అలాగే ఇది తరువాతి భారతీయ ఆంగ్ల కవిత్వ గమనంపై ప్రభావం చూపింది. ఎజెకిల్ తన ఆధునికవాద ఆవిష్కరణలు, మరింకా పద్ధతుల ద్వారా భారతీయ ఆంగ్ల భాషా కవిత్వాన్ని సుసంపన్నంగా నిలిపాడు.ఇది భారతీయ ఆంగ్ల సాహిత్యాన్ని విస్తరించింది. ఇది పూర్తిగా ఆధ్యాత్మిక, ప్రాచ్యవాద ఇతివృత్తాలకు మించి కదిలింది. ఇంకా కుటుంబ సంఘటనలు, వ్యక్తిగత ఆందోళనతో పాటు సందేహాస్పద సామాజిక ఆత్మపరిశీలనతో సహా విస్తృత శ్రేణి ఆందోళనలు మరియు ఆసక్తులను కలిగి ఉన్నది.ప్రపంచ వ్యాప్తంగా పాఠకులను ఆకర్షించగలిగిన ప్రముఖ భారతీయ ఆంగ్ల కవి నిస్సిమ్ ఎజెకిల్ కవిత్వమంతా వైవిధ్యంగా వుంది.అది ఎలాంటి ప్రౌఢ పదాలు,వృధా ఆడంబరాలు లేని స్పష్టత ఉంటుంది.అట్లనే ఆయన వ్యాకరణ నడ్డి విరిచిన ధైర్య కవిత కూడా.'రణగొణల నగరం స్లమ్స్ లో ఒకానొక ఒంటరి గది తనది, అది మమతానురాగాల వాస్తవిక నివాసం' అంటాడు. నిస్సిమ్ ఎజెకిల్ కవి ముంబైలోని పట్టణ జీవితాన్ని, ముఖ్యంగా మధ్యతరగతి భారతీయులు ప్రవాహంలో ఉన్న సమాజంలో నావిగేట్ చేసే అనుభవాలను ఆయన రచనలు నిరంతరం చిత్రీకరిస్తున్నాయి. తన కవితల్లో దేవునిపై వ్యక్తీకరించినా నిశ్చితాభిప్రాయాలు ఉన్నవి. ఒకచోట 'నేను సంప్రదాయ మతవాదిని కాను,నాకు "మతం పర్సనల్ మాత్రమే"అని అంటూ 'ఈ రెండు వాక్యాల నడుమ గల తేడానే నా కవిత్వమంతా' అంటాడు నిస్సిమ్ ఎజెకిల్. ఎజెకిల్ కవిత్వంలో సూటిదనం, సంభాషణ స్వరంగా ఉంటుంది. ఆధునిక జీవితంలోని కపటత్వం ఇంకా వైరుధ్యాలను బహిర్గతం చేయడానికి ఆయన తరచుగా వ్యంగ్యయుక్తి మరి పరిహాస వ్యంగ్యాన్ని ప్రయోగించే ఆయన కవితలలో డైలీ రొటీన్ ఇష్యూష్ నిశితంగా పరిశీలించడం, లౌకిక జీవితంలో అర్థాన్ని కనుగొన్నారు. అట్లాగే గుర్తింపు,ఇంకా పరాయీకరణ, వేగంగా మారుతున్న ప్రపంచంలో అర్థాలను అన్వేషించే ఇతివృత్తాలుగా గుర్తింపు పొందాయి. ఒక నిర్దిష్ట సాంస్కృతిక సందర్భంలో వ్యక్తిగత, సామాజిక ఆందోళనలపై ఆయన దృష్టి అందుబాటులో ఉన్న భాష ద్వారా వ్యక్తీకరించబడి, తన కాలంలో ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టింది. వలసరాజ్యానంతర ప్రపంచంలో భారతీయ గుర్తింపుతో సంక్లిష్టతలను అదే పద్ధతిలో అన్వేషించిన అరుణ్ కోలాట్కర్ ఇంకా ఎ.కె. రామానుజన్ వంటి ఇతర భారతీయ ఆంగ్ల కవులతో పాటు ఎజెకిల్ను పరిగణించవచ్చు. సమకాలీన సమస్యలతో కనిపించిన మరి నిశ్చితార్థాన్ని నొక్కిచెప్పిన టి.ఎస్. ఎలియట్ అలాగే డబ్ల్యూ.హెచ్. ఆడెన్ వంటి ఆధునిక కవులు కూడా ఆయన రచనలను ప్రభావితం చేశారు.


నిమ్స్ ఎజెకిల్

నిస్సిమ్ ఎజెకిల్ రాసిన 'ఐలాండ్' కవిత
"ద్వీపం"
"పాటకు భావానికి
అనుకూలం కాని
ద్వీపం మురికివాడలలో
వికసిస్తుంది.
మరింక
ఆకాశహర్మ్యాలు
మునుపటి మనస్సు
పెరుగుదలను
ప్రతిబింబిస్తాయి.
నేను నా మార్గాన్ని దానిలో కనుగొనడానికి ఉన్నాను
ఇక్కడ.
కొన్నిసార్లు నేను సహాయం కోసం అరిచాను
కానీ ఎక్కువగా సలహా నా స్వంతంగా ఉంటుంది.
నేను వక్రీకరించిన ప్రతిధ్వనులను వింటాను
అస్పష్టమైన నా స్వంత స్వరంలో.
మరిక మానవుడని చెప్పుకునే డ్రాగన్లు,
ప్రకాశవంతమైన ఆకర్షణీయమైన గాలులు
ప్రవహిస్తాయి ద్వీపమంతటా .
భవిష్యత్తు నుండి గతాన్ని వేరు చేయడం;
మళ్ళీ వీస్తుంది అప్పుడు గాలి
ఎలా ఆనందపరుస్తుంది నేను నిద్రపోయే వేళ అజ్ఞాన
సువాసన,సంపూర్ణమైన మోక్ష భావనతో ఆత్మను .
ఇక ఒకే సంకల్ప దిశను ఎలా పట్టుకోవాలి?
నేను ద్వీపాన్ని వదిలి వెళ్ళలేను.
నేను ఇక్కడే పుట్టాను మరి ఈ మట్టి జీవిని కూడా.
ఇప్పుడు కూడా అద్భుతాల సమూహం
నాకు రోజువారీ వ్యాపారాన్ని వేగవంతం చేస్తుంది,
ద్వీపం యొక్క మార్గాలను గుర్తుచేస్తుంది
ఒక మంచి స్థానికుడిలాగా,
నా అడుగులో ప్రశాంతత మరియు అరుపులను
చేస్తుంది".

అలా స్వాతంత్ర్యానంతర భారతీయ ఆంగ్ల కవిత్వంలో ఒక గొప్ప కేంద్ర వ్యక్తి, కవిత్వ శక్తిగా వెలిసిన నిస్సిమ్ ఎజెకిల్ నిస్సిమ్ ఎజెకిల్ డిసెంబర్ 16,1924న బొంబాయిలో జన్మించి, జనవరి 9,2004న ముంబాయిలో కన్నుమూశారు.నిస్సిమ్ ఎజెకిల్ తన జీవితకాలంలో ఆకుపచ్చ సాహిత్య వృక్షంగా వెలిగి అక్షరాన్వేషణ కిటికి నుండి కవిత్వపూలు ఫలాలు మనకు అందించిన గొప్ప కవి .

- డా టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871.

# జీవించడం కూడా ఒక హింసాత్మక చర్యే

"నిజమైన కవిత్వం ఎప్పటికీ పాతబడదు, ప్రాణం లేనిదిగా మిగిలిపోదు. దానిని పాత కాలపు కవిత్వమని, ఆధునిక కవిత్వమని వర్గీకరించలేము. అది చరిత్ర, భౌగోళిక సరిహద్దులు సృష్టించే కృత్రిమ అడ్డంకులను చెరిపివేస్తుంది. అటువంటి కవిత్వం ఎప్పుడూ సమకాలీనమే. అమరత్వం అనేది ఇక్కడ, ఇప్పుడే ఉంటుంది.వ్యాసుడు, హోమర్, కాళిదాసు, సారళా దాస్, భారతి, కుమారన్, లోర్కా, రవీంద్రనాథ్ టాగూర్, నెరూడా మరియు నిరాలా——వీరంతా ఇక్కడే, ఇప్పుడే జీవిస్తున్నారు. వారందరూ మన సమకాలీనులే. బహుశా, లోకంలోని కవులందరూ కలిసి, రంగురంగుల వైవిధ్యంతో ఒకే ఒక్క మహా కావ్యాన్ని వాయిదాల పద్ధతిలో నిరంతరాయంగా రాస్తూనే ఉన్నారేమో!"

తనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ వచ్చినప్పుడు ఆ అవార్డు స్వీకరిస్తూ చేసిన ప్రసంగం లో రాజేంద్ర కిషోర్ పాండా చెప్పిన వాక్యాలవి . variegated splendour అన్న మాటను కూడా పాండా తన ప్రసంగం లో అన్నారు. ఆ మాటను ను ఇన్ డెప్త్ గా అనువదించుకుంటే రకరకాల తాత్విక భూమికలు అనుకోవచ్చేమో . వయక్తికమైన , రకరకాల తాత్విక భూమికలు ఒకే మహా అస్తిత్వం లో వొదిగిపోయినప్పుడు హోమర్ కీ కాళిదాస్ కీ మధ్య పెద్ద తేడాకూడా ఉండదేమో . రాజేంద్ర కిషోర్ మరొక మాట కూడా అంటున్నారు సింగిల్ పోయెమ్ బీయింగ్ రిటన్ కంటిన్యూలీ ఇన్ ఇన్స్టాల్మెంట్స్ అనీ .

ఈ మాటలను అందరూ అంగీకరిస్తారో లేదో తెలీదు కానీ ఒకే వర్ణ , ఒకే వర్గ , సమాజం లో నివసిస్తున్న ప్రజలందరి బాధలూ , గాథలూ ఒకే రకంగా వుండవు. ఆధిపత్యము , అణచివేతల సాంద్రత లో స్థాయీ బేధాలు తప్పనిసరిగా ఉంటాయి. అవి కలిగించే నొప్పి కూడా స్థాయీ బేధాలతోనే మనుషులను వేధిస్తుంది. ఈ నొప్పిని కవి వ్యక్తీకరించే, అక్షరీకరించే రీతి లోనూ స్థాయీ బేధాలు , కవుల సామర్థ్యాలను బట్టి విడి విడి గానూ ఉంటాయి. ఈ స్థాయీ బేధాలన్నీ కవిత్వం అనే ఒక మహా తాత్వికత లో వొదిగిపోవడం గురించి రాజేంద్ర కిషోర్ మాట్లాడాడు అనుకోవాలి

ఇంకా రాజేంద్ర కిషోర్ పాండా ఇలా చెప్తున్నాడు

"కవికి గనుక తన ఇష్టం సాగితే, అతను అన్ని తలుపులను, పంజరాలను, కారాగారాలను, జంతుప్రదర్శనశాలలను మరియు ఆకాశాలను బద్దలు కొట్టాలని కోరుకుంటాడు. అతను సముద్రపు గవ్వలను, విత్తనాలను, యోని ద్వారాలను, కొండ చరియల చీలికలను తెరిచి ఉంచుతాడు. ఎర్రటి రక్తపు నదులను తిరిగి ఆదిమ మహాధమనిలోకి (primordial aorta) ప్రవహించమని ఆజ్ఞాపిస్తాడు. అతను ఈ ఉదయం ఇంద్రప్రస్థాన్ని ముక్కలు ముక్కలుగా కూల్చివేసి, తిరిగి సాయంత్రానికల్లా ఇటుక ఇటుక పేర్చి దానిని నిర్మిస్తాడు. దేవతలకు, రాక్షసులకు మరియు మానవులకు——ఎవరి ఆకలికి తగినట్లుగా వారికి అమృతాన్ని తినిపించమని అతను మోహినిని ప్రలోభపెడతాడు.

అలాంటి వాడు, వీటన్నింటికీ బదులుగా కవిత్వం గురించి, సృజనాత్మకత గురించి మాట్లాడాలా? నేను తర్కాలలోని దారాలను కోల్పోతుంటాను. చల్లని తర్కం నాకు విరోధి, ఒకే మూసలో పోయడం (mould) అంటే నాకు అసహ్యం. నేను గుర్రపు కళ్లాలను వదిలేసి, కిందకు దిగిపోతాను. నా గుర్రం పౌరుషంతో, వన్యంగా, రౌతు లేకుండా, దిశానిర్దేశం లేకుండా తన దారిన తాను అశ్వమేధానికి పరుగు తీస్తుంది. నేను సిద్ధాంతాలను, ఉపదేశాలను మరియు ఆజ్ఞలను తృణీకరిస్తాను. కవిత్వం గురించి నేను ఇక ఏం చెప్పగలను సిద్ధాంతాలను , ఉపన్యాసాలను , ఆజ్ఞలను తిరస్కరించడం లోనే కవి కవిత్వ వ్యక్తిత్వం దాగి ఉంటుంది. ఈ తిరస్కరించడం లోనే variegated splendor దాగి వుంటుంది."

ఎవరీ రాజేంద్ర కిషోర్ పాండా ?

రాజేంద్ర కిషోర్ పాండా , పాండా , రాజేంద్ర గా ఒడియా సాహిత్య లోకం ఆత్మీయంగా పిలుచుకునే కవి , నవలా రచయిత. రాజేంద్ర జూన్ 24 న సంబల్పూర్ జిల్లాలోని నటాషా గ్రామం లో జన్మించారు . అలహాబాద్ యూనివర్సిటీ నుండి డిగ్రీ తీసుకుని ఇప్పటివరకూ 16 కవిత్వ సంపుటాలకు పైగా ప్రచురించారు . రెండు నవలలు రాశారు . తన మొదటి కవిత్వ సంపుటి గౌన్ దేవత (మైనర్ గాడ్స్ ) 1975 లో వచ్చింది . రెండు వెబ్ అంథాలజీస్ సంపాదకత్వం వహించి ఒక వెబ్ మ్యాగజైన్ నడుపుతున్నారు . ఒడియా కవిత్వం లో నియో మోడరనిజం కి ఆద్యుడు సత్ చిదానంద రౌత్రే అయితే ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకున్నది రాజేంద్ర కిషోర్ పాండా . మహా నది మీద హీరాకుడ్ ప్రాజెక్ట్ కట్టినప్పుడు 285 గ్రామాలు నదిలో మునిగిపోగా విస్థాపితులైన 22000 ల కుటుంబాలలో రాజేంద్ర కిషోర్ పాండా కుటుంబము కూడా వుంది. “Style is often the other name of selfrepetition” అని బలంగా విశ్వసించే రాజేంద్ర తన కవిత్వం నిండా భిన్న ఆలోచనలకు , భిన్న దృక్పధాలకు తలుపులు తెరిచారు ఈ కవిత చూడండి



**గుప్పెడు బియ్యం**

గుప్పెడు బియ్యం
కేవలం గుప్పెడు బియ్యమే
పండిన పంట అంతా
కానీ లోకమంతా ఆకలి
ఒక్కొక్కరికీ ఎంత భాగం వస్తుంది
వండటానికి ఎంత ?
దయా దాక్షిణ్యాల కెంత ?

రేపు అక్షయ త్రితీయ నాడు
నాటడానికి విత్తనమెక్కడనుండి వస్తుంది?

పంటపొలాన్ని , ధాన్యపు గాదెనీ
ఎద్దులనీ, కొడవళ్ళనీ, నాగళ్ళనీ
నోటినీ, చేతినీ, పొట్టనీ ,
బుద్ధినీ , జాగరూకతనీ
నీరునీ, నిప్పుని ,గాలినీ ఆకాశాన్నీ ,
దేవుడినీ , అన్నిటినీ మించి
నేల తల్లినీ, ఎవరిని ప్రశ్నించాలి?

అందరూ మూగ వోయారు కదా
కేవలం గుప్పెడు బియ్యం
పండిన పంట అంతా
ఒక్కసారి పొట్టంతా తీసిపారేశాక
మిగిలినది అంతా
బలి ఇచ్చే మేక పిల్లకి పెట్టిన లంచం ముక్క

“I’ve declared love against all of mankind, unilaterally” అని చెప్పుకునే రాజేంద్ర ఈ గుప్పెడు బియ్యం కవిత రాసినప్పుడు ఈ దేశం ఆహార కొరత తో బాధ పడుతూ వుండేది. హరిత విప్లవం వచ్చాక దేశం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించింది. అయినా కొన్ని లక్షల టన్నుల ధాన్యం గోదాములలో ఎలుకల బారిన పడుతున్నాయి కానీ పేదవాడి నోటికి ఐయితే అందటం లేదు. కరోనా సమయం లో వలస కార్మికులను ఆదుకోవడానికి ఆ ధాన్యపు గోదాములు ముందు రాలేదు . అప్పటికీ , ఇప్పటికీ పరిస్థితి ఏమి మారింది

"ఒక కవి తప్పనిసరిగా తీవ్రవాద కార్యకర్తగా (radical activist) మారిపోవాలన్న నియమమేమీ లేదు. అలాగని కవిత్వం ద్వారా ఈ గ్రహం రాత్రికి రాత్రే మారిపోతుందని భ్రమపడాల్సిన అవసరం కూడా లేదు. కానీ, మూగబోయిన గొంతుకల కోసం కవి తన సానుకూలమైన, సృజనాత్మకమైన ‘అంతరాత్మ ప్రబోధాన్ని’ (voice of conscience) అందించడం అనేది ఒక గొప్ప మద్దతు. కొందరు తామే నీతిమంతులమనే అహంతో ఒక ఎత్తైన పీఠంపై నిలబడి, జనరంజకమైన (demagogic) మరియు నిందాపూర్వకమైన స్వరాన్ని వినిపిస్తుంటారు. నిజానికి, రాజకీయ కవిత్వం అనే ముసుగులో చాలా చెత్త కవిత్వం వస్తోంది; అది చూడటానికి కేవలం ముక్కలు ముక్కలుగా విరిచిన ఒక ప్రచార పత్రంలానో (propagandist pamphlet) లేదా ప్రాస కోసం పాకులాడే పేలవమైన పద్యంలానో ఉంటుంది. ఒక కవి బాధ్యత వహించాలని నేను నమ్ముతాను. సమాజంలోనూ, రాజకీయాల్లోనూ కొనసాగుతున్న దుష్టత్వానికి కవి కూడా బాధ్యుడే."అన్న ఎరుక వున్నది కనుకే షూట్ ది ఫస్ట్ బుల్లెట్ ఎట్ మీ అని ఒక కవిత లో అనగలిగాడు రాజేంద్ర . తన మరొక కవిత చూడండి

**జీవనం కూడా ఒక హింసాత్మక చర్య**

అవును
జీవనం కూడా ఒక హింసాత్మక చర్య

మనిషి ఉచ్వాస , నిశ్వాసలు తీసుకోవడం లో
పైకీ, కిందకూ ప్రయాణించే లేత గాలి ఎంత హింస పడుతుంది ?
సువాసనలు వెదజల్లె సబ్బు
ఎన్నెన్ని క్రిములను అమరవీరులుగా చేస్తుంది
పంటను కోల్పోయినప్పుడు భూమి ఎంత బరువు మోస్తుంది
దంత క్షతాలను ఆ తాజా పండు ఎలా భరిస్తుంది
మండే గొంతును తడపడానికి
ప్రవహించే నది లో నుండి దోసెడు నీళ్ళు దొంగిలిస్తాం కదా!

ఆ అందమైన రాజకుమారి ధరించడానికి
పట్టు , పత్తి రూపం లో ఈ భూమిని ఎంత హింస పెడతాం
ఈ హింసను భరించలేక ఆ పృథ్వి కూడా
ఫిర్యాదు చేస్తుందేమో ......?

ఏదో ఒక రూపం లో జీవించడం కూడా
ఒక హింసాత్మక చర్య కాక మరేమిటి ?
ఒక చిన్న గాయం తగిలినా లోలోపల ప్రవహించే
నెత్తురు బయటకు దూకాలని ప్రయత్నిస్తుంది
ఎముకల నుండి ఖటికం బయటపడాలని ఉరుముతుంది
జననాంగాలనుండి వంశవృక్షం మొలకెత్తుతుంది
శరీర సరిహద్దులు దాటి ఆత్మ పక్షి ఎగిరిపోవాలని


- రాజేంద్ర కిషోర్ పాండా

ప్రయత్నిస్తుంది
శతపాద జంతువొకటి జరాజరా పాకుతుంది

కర చాలానాల మధ్య
కౌగిలింత కోసం సాచిన బాహువుల మధ్య స్పర్శ
ముళ్ల పందిని తలపిస్తుంది
ఒకే ఆత్మ రెండు శరీరాలుగా ఉన్న స్నేహితుల
కలయిక కూడా తిరస్కరణే అవుతుంది
ఈ సంఘర్షణాయుత పోరాట ప్రపంచం లో
జననం లాగా , మరణం లాగా
జీవించడం కూడా ఒక హింసాత్మక చర్యే

నిజమే జీవితంలో ఎంత హింస వుంది ? మనకు తెలియకుండానే ఎంత హింసకు పాల్పడుతూ ఉంటాము.

రామాయణం లో శంబూక వధ గురించి మనందరికీ తెలుసు . త్రిపురనేని రామస్వామి చౌదరి గారు శంబూక వధ శీర్షికన ఒక కావ్యం కూడా రాసారు . రాజేంద్ర కూడా శంబూక వధ ను తన కవిత్వం లో రాశారు .

The endeavour of Man is
neither to become a star
nor to merge with God
it’s to become wholly God,

మనిషి దాహానికి లక్ష్యం కేవలం నిర్వాణం పొందటం మాత్రమే కాదు . తానే అమ్నిప్రెసెంట్ గా నిలవడం అని శంబూక వధ ఒక కొత్త డైమన్షన్ ఇచ్చారు రాజేంద్ర భూమి అన్న కవితలో రాజేంద్ర

దేశమా ?
దేశాల గురించి నన్ను అడగకండి
దేశం అంటూ ఏదీ లేదు
కొన్ని పురాతన మంచు తెరలు
భూ కార్టోగ్రఫీ కి
విభజన రేఖలు గీసి రంగులద్దాయి
కవి వాటిని నిరాకరిస్తాడు

ఒక కవికి ఏమి కావాలి “blankness is all”. , ఇదే కవికి కావాల్సింది . Perhaps it is impossible to improve the blank page. Moreover, blankness is vast, limitless. As John Updike says, “Blankness is not emptiness; we may skate upon an intense radiance we do not see because we see nothing else.” Yes, for a poet, blankness is all. Amen. ఇది రాజేంద్ర కిషోర్ పాండా కవిత్వ తత్వ వివేచన రాజేంద్ర సర్ . లవ్యూ

- వంశీకృష్ణ
- 95734 27422

# బాలల మనసుల్లో విలువల పరిమళం..
# 'రంగు పూల వాగు' కథల సాగు

తెలుగు బాల సాహిత్య వనంలో పుప్పాల కృష్ణమూర్తి అందించిన 'రంగు పూల వాగు' ఒక అద్భుతమైన పారిజాతం వంటిది. 2025లో వెలువడిన ఈ పుస్తకం కేవలం కథల గుచ్ఛం మాత్రమే కాదు, నేటి తరం పిల్లలకు దిశానిర్దేశం చేసే ఒక నైతిక విలువల దీపిక. రంగురంగుల పేజీలు, ఆకర్షణీయమైన బొమ్మలతో ముద్రితమైన ఈ గ్రంథం పిల్లలను ఇట్టే ఆకట్టుకుంటుంది. ఈ కథా సంపుటిలో మొత్తం 19 కథలు ఉండి, 82 పేజీలతో అలరిస్తుంది. రచయిత ఇందులో జంతువుల పాత్రల ద్వారా మానవ స్వభావంలోని లోటుపాట్లను ఎంతో చమత్కారంగా ఎండగట్టారు. ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం వంటి అంశాలను ఇందులో హృద్యంగా చర్చించారు. సామాజిక స్పృహను పెంపొందించే ఈ కథలు బాలల మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయి. ముఖ్యంగా 'కోతికి వచ్చిన తంటా' కథలో అహంకారం వల్ల కలిగే నష్టాన్ని రచయిత కళ్లకు కట్టారు. గొలుసుతో కట్టేసి ఉన్న కుక్కను చూసి వెక్కిరించిన కోతి, చివరకు ఆ కుక్క వల్లే ప్రాణభిక్ష పొంది పశ్చాత్తాపపడటం ఒక గొప్ప పాఠం. ఎవరినీ తక్కువ చేసి చూడకూడదనే జీవన సత్యాన్ని ఈ కథ నేర్పుతుంది. అలాగే 'శత్రువు చేసిన మేలు' కథ పరోపకార బుద్ధిని చాటిచెబుతుంది. తను చంపాలనుకున్న ఏనుగే తన ప్రాణాలను కాపాడటంతో సింహంలో కలిగిన మార్పు ఆశ్చర్యపరుస్తుంది. కల్పిత భయాల కంటే కళ్ల ముందున్న మంచితనమే గొప్పదని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

అడవిలో శత్రుత్వం అంతమై శాంతి నెలకొనడం సమాజానికి అవసరమైన ఒక గొప్ప సందేశం. ఇక 'నక్క ఎత్తు కోతి చిత్తు' కథలో బుద్ధి బలం యొక్క ప్రాముఖ్యతను రచయిత వివరించారు. ప్రత్యర్థి బలహీనతలను ఆసరాగా చేసుకుని పనులు ఎలా సాధించుకోవాలో ఈ కథ వినోదాత్మకంగా చెబుతుంది. 'గాడిద తెలివి' కథ ద్వారా మన పరిమితులను గుర్తించకపోతే అవమానాలు తప్పవని హెచ్చరించారు. తన శక్తికి మించిన సాహసాలు చేసి యజమాని దృష్టిలో గాడిద పలచన కావడం మనల్ని ఆలోచింపజేస్తుంది. పిల్లలు తమ బాధ్యతలను, శక్తి సామర్థ్యాలను గుర్తించి ప్రవర్తించాలని ఈ కథ బోధిస్తుంది. 'ఆకలి' అనే కథలో ఆడంబరాల కంటే అవసరానికి చేసే సహాయమే మిన్న అని నిరూపితమైంది. రాజు పిలిచినా వెళ్ళని గుర్రం, మంత్రి గడ్డి చూపించగానే వెళ్ళడం ద్వారా మాటల కంటే చేతలే ముఖ్యమని తెలుస్తుంది. ఆకలితో ఉన్న ప్రాణికి ఆహారం అందించడమే నిజమైన భూతదయ అని రచయిత చాటిచెప్పారు. రాజు తన అహంకారాన్ని వీడి మంత్రి విజ్ఞతను అంగీకరించడం ఈ కథలో కీలక మలుపు.

శీర్షిక కథ అయిన 'రంగు పూల వాగు'లో పర్యావరణ విధ్వంసం పట్ల రచయిత వ్యక్తం చేసిన ఆవేదన ప్రతి పాఠకుడిని కదిలిస్తుంది. బేతవోలు ప్రాంతంలోని



వీర్లదేవి చెరువు, ఆ వాగు ఒకప్పుడు ఎలా కళకళలాడేవో వివరిస్తూ, నేడు అవి కలుషితం కావడాన్ని రచయిత హృద్యంగా వర్ణించారు. ఇసుక తవ్వకాలు, రసాయన


- పైడిమర్రి రామకృష్ణ
9247564699

వ్యర్థాల వల్ల విషతుల్యమవుతున్న జలవనరులను చూసి రచయిత ఆవేదన చెందారు. మన పూర్వీకులు అందించిన ప్రకృతి సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని ఈ కథ నొక్కి చెబుతుంది. సాంస్కృతిక మరియు చారిత్రక ప్రాధాన్యత కలిగిన వాగుల విశిష్టతను బాలలకు పరిచయం చేయడం ఎంతో ప్రశంసనీయం. ఈ సంపుటిలో ఇంకా నాలుగు చేపలు, పరుల కోసం, నగరంలో పింక్ వంటి అనేక ఆసక్తికరమైన కథలు ఉన్నాయి. ప్రతి కథలోనూ మానవ స్వభావం, సమాజ పోకడలు అద్దం పట్టినట్లు కనిపిస్తాయి. సరళమైన పదజాలంతో సాగే ఈ రచనలు తెలుగు భాషాభిమానాన్ని పెంచుతాయి. బాలల మనసుల్లో సత్ప్రవర్తనను పెంపొందించడానికి ఇటువంటి పుస్తకాలు ఎంతో అవసరం. పుప్పాల కృష్ణమూర్తి కృషి బాల సాహిత్యంలో ఒక మరుపురాని ఘట్టం. ఈ పుస్తకం ధర కేవలం 150 రూపాయలు మాత్రమే. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ అన్ని శాఖల్లోనూ ఈ పుస్తకం లభిస్తుంది. అలాగే శ్రీమతి రావూరి రమాదేవి గారిని (9652116371) సంప్రదించి కూడా ఈ పుస్తకాన్ని పొందవచ్చు.

## పుస్తకం మూసేస్తే కథ అయిపోదు

నా కలల బారాత్
ఈ చీకట్లోనే బయలు దేరుతుంది

నిద్రలేపే సారంగి పాట
ఈ వర్షంలోనే మారుమోగుతుంది

సంఘర్షణల సంకేతాన్ని
ఈ రాత్రి వేగుచుక్కే చూపుతుంది

అడుగుల, పిడుగుల, మెరుపుల అలజడి
ఈ చుక్కలు లేని ఆకాశంనుండే మొదలవుతుంది

ధనవంతులు నిరుపేదలకు
అదృష్టం మీద మూఢ నమ్మకం తప్పా
నిలువనీడ కూడా మిగిల్చలేదు

ఓడిపోయిన తర్వాత, పోరాటం ఆగదు
పట్టుదల ఇంకా భయంకరంగా వుంటుంది

పుస్తకం మూసేస్తే కథ అయిపోదు
ఆపిన చోటునుండే ఆలోచన కతను నడిపిస్తుంది

- ఆశారాజు
9392302245

## రెండు కవితలు

1
మారణ కాండ
పసిపాపల గోడు
పాలస్తీనా బీడు
2
నీటి లో మంటలు
చేపల భయం గోల
నీటిలో దిగిన మనిషి
భయపడితే డీల

రేడియమ్
9291527757

రచనలకు ఆహ్వానం
సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

పుస్తక సమీక్షల కోసం...
తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

## ముల్యాంకనం

**పెద్దగా పేచీలేదు**
**వ్యాకరణ దోషాన్ని అడ్డుపెట్టి ఖండించను**
**విరామ చిహ్నాల మారామేమి చేయను**
**ప్రారంభ పదం అడుగు విస్ఫోటనం పట్ల**
**నమ్మకాన్ని పెట్టుకోలేదు**
**విషయ అస్పృశ్యత నాకు బద్ద శత్రువు**
**దరికి రానివ్వను, శ్రీ శ్రీ లా**
**భాషా లొల్లిల ప్రాంతాల సొగసు తీగలా లాగి,**
**ఫలానా ముద్ర వేయను**
**పేజీ నిండిందా, దాటిందా అనే కొలతల జోలికి**
**వెళ్ళను**
**అక్షర లిపి కనుసొంపుగా వుందా లేదా**
**అనే ప్రశ్నే వేయను**
**పోలికలు పురాతనమా, ఆధునికమా, చుట్టూ**
**పరిభ్రమిస్తున్నవా భూతద్దాన్ని పెట్టి, గీతలు కొట్టి**
**నిందించను**
**ఏది దేన్నాశ్రయించిదనో, మరేది దేన్ని మింగేసిం-**
**దనో**
**సున్నితపు త్రాసులో తూచటం యిష్టపడను**
**బైరాగినా, జాషువానా, నారాయణబాబునా,**
**తిలక్ నా**
**తెచ్చి, శల్య పరీక్షకు సిద్ద పరచను**
**అన్వయ న్యాయాన్యాయాల కోర్టులో నిలబెట్టను**
**అయోమయార్థం నెలకొందని కించిత్ అసంతో-**
**షంలో ముంచను**
**విపులీకరణలో అధ్యయనం కొరవడిందని సూత్ర-**
**ప్రాయం గానూ వాచ్యించను**
**ముస్తాబులో అందాల సుగంధాల వాడకం**
**మోతాదును బేరీజు వేయను**
**దృక్కోణమాని కోణంతో విభేదముందని నమ్మకు**
**ఉపదేశమా ఆదేశమా ఆక్రోశమా**
**యుద్ధోన్ముఖమా**
**ఆఖరి కూర్పులో ఏ మోఖా లిఖింపజేసిందో**
**పట్టించుకోను**
**నామకరణం సెన్సేషనల్ ఎమోషనల్ క్యాచీ**
**సింపుల్**
**వర్గాలకు స్థాయీ బేధాల పట్టికేది పాటించను**
**ఎన్నైనా వుండనీ ఏవైనా లేకపోనీ**
**కలల తడులంటి వాక్యాలు పచ్చగా వున్నవా**
**మనసు మూలల పరిశుభ్ర వాసన వ్యాపించిందా**
**పదుగురానందించే బ్రతుకును చేతిలో పెట్టిందా**

**అదే గొప్ప కవిత్వమని నినదిస్తా**


- దాసరాజు రామారావు

## బెంగళూరు డైలీ ఎక్స్ ప్రెస్ కోసం..

# మణుగూరులో మరో ఉద్యమం..?

### రైళ్ల రద్దుతో వెలవెలబోతున్న రైల్వే స్టేషన్..

### యలహంక – కాచిగూడ రైలును పొడిగించాలన్న డిమాండ్..!

**మణుగూరు, మహా :** తెలంగాణ రాష్ట్రంలో కరోనా మహమ్మారి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినలాక్‌డౌన్‌కు ముందు వరకు మణుగూరు రైల్వే స్టేషన్ నాలుగు జతలుగా ఎనిమిది రైళ్ల రాకపోకలతో సందడిగా ఉండేది. ప్రస్తుతం మణుగూరు రైల్వే స్టేషన్ పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా మారిపోయింది. ఒకప్పుడు ప్రయాణికులతో కిక్కిరిసిన ప్లాట్‌ఫామ్ ఇప్పుడు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. కేవలం సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే మణుగూరు స్టేషన్‌ను పలకరిస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.రద్దైన రైళ్లు.. తగ్గిన ఆదాయం మణుగూరు రైల్వే స్టేషన్ విలవిలలాడుతోంది. లాక్‌డౌన్ అనంతరం కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్, కాజీపేట ప్యాసింజర్ రద్దయ్యాయి. అలాగే కాకతీయ ఎక్స్‌ప్రెస్ కొత్తగూడెంకే పరిమితమైంది. దీంతో మణుగూరు నుంచి బయలుదేరే రైళ్ల సంఖ్య ఒక్కటికి పడిపోయింది.రైళ్ల సంఖ్య తగ్గడం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా గణనీయంగా పడిపోయింది. స్టేషన్ ఆదాయం తగ్గడంతో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే ఉన్న ఒక్క రైలు కూడా నిలిపివేస్తారేమోననే భయం వ్యక్తమవుతోంది.బెంగళూరుకు నేరుగా మణుగూరు నుంచి రైలు అవసరం ఉంది. దక్షిణ మధ్య రైల్వేలో కీలకమైన సికింద్రాబాద్ - కాజీపేట - విజయవాడ మార్గంలో బెంగళూరుకు నేరుగా రైలు లేకపోవడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. బెంగళూరు వెళ్లే చాలా రైళ్లు కాచిగూడ నుంచే బయలుదేరుతుండటంతో ఈ ప్రాంత ప్రజలు అదనపు ప్రయాణ భారం మోయాల్సి వస్తోంది.ప్రస్తుతం బెంగళూరు యలహంక నుంచి కాచిగూడకు నడుస్తున్న యలహంక-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ (17603/17604) రైలు కాచిగూడలో సుమారు 16 గంటలు ఖాళీగా ఉంటుంది. ఈ సమయాన్ని వినియోగించి ఆ రైలును సికింద్రాబాద్ మీదుగా మణుగూరుకు పొడిగిస్తే, భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల ప్రజలకు బెంగళూరుకు నేరుగా సౌకర్యం లభిస్తుంది.




**అనుసంధానానికి అవకాశాలు..**

ప్రస్తుతం బెంగళూరు యలహంక నుంచి కాచిగూడకు నడుస్తున్న యలహంక-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ (17603/17604) రైలు కాచిగూడలో సుమారు 16 గంటలు ఖాళీగా ఉంటుంది. ఈ సమయాన్ని వినియోగించి ఆ రైలును సికింద్రాబాద్ మీదుగా మణుగూరుకు పొడిగిస్తే, భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల ప్రజలకు బెంగళూరుకు నేరుగా సౌకర్యం లభిస్తుంది. ఒకవేళ రైలుకు మణుగూరులో విరామ సమయం సరిపోకపోతే, ప్రస్తుతం నడుస్తున్న సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ తో పెయిరింగ్ విధానం అమలు చేయవచ్చని సూచిస్తున్నారు. ఉదయం సికింద్రాబాద్ నుంచి వచ్చే రైలు మధ్యాహ్నం యలహంక వెళ్లేలా, మధ్యాహ్నం యలహంక నుంచి వచ్చే రైలు రాత్రి సికింద్రాబాద్ వెళ్లేలా ప్రణాళిక రూపొందించవచ్చు.రెండు రైళ్ల కోచ్ కంపోజిషన్ ఒకేలా ఉండాల్సి ఉండటం చిన్న సాంకేతిక అంశమేనని, రైల్వే అధికారులు సులభంగా పరిష్కరించగలరని నిపుణులు చెబుతున్నారు.

**ప్రజాచైతన్యం అవసరం..**

ప్రస్తుతం మణుగూరు ప్రాంతానికి ఉన్న రాజకీయ ప్రాతినిధ్యాన్ని ఉపయోగించుకుని ప్రజలు ఐక్యంగా ముందుకు వస్తే మణుగూరు నుంచి బెంగళూరుకు డైలీ ఎక్స్‌ప్రెస్ సాధ్యమవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మణుగూరు స్టేషన్‌కు పూర్వ వైభవం రావాలంటే.. ప్రజలే మేల్కొని ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైంది.

# సత్తుపల్లి మీడియా టీం ఘన విజయం

### 90 రన్స్ లక్ష్యాన్ని 13 ఓవర్లలో చేదించిన మీడియా టీం

**సత్తుపల్లి, మహా:** సత్తుపల్లి లోని జేవీఆర్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం టీ 20 క్రికెట్ మ్యాచ్ సీనియర్ జర్నలిస్టు బివి రామారావు(టివి 9) నేతృత్వంలో సత్తుపల్లి మీడియా వర్సస్ గంగారం బెటాలియన్ పోలీస్ టీం మధ్య స్నేహపూర్వక మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ లో సత్తుపల్లి మీడియా టీం 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన బెటాలియన్ టీం ముందుగా బ్యాటింగ్ కు దిగి 15 ఓవర్లకు 9 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది .బౌలింగ్ లో బేతి ఆనంద్ (బిఆర్కె), చీపు గంగాదర్ (టివి5), నిమ్మగడ్డ శ్రీకాంత్ (ప్రజాపక్షం) 2 వికెట్లు, లింగగిరి రామకృష్ణ(టి న్యూస్) 2 వికెట్లు, రాంబాబు (సివిఆర్ న్యూస్)2 వికెట్లు, దార్ల సురేష్ (బిగ్ టీవి) 3 వికెట్లు సాదించారు. అనంతరం 90 పరుగుల లక్ష్య చేధనకు దిగిన మీడియా టీం ఓపెనర్లు శ్రీకాంత్, బర్రె రామకృష్ణలు త్వరగా పెవిలియన్ కు చేరినా లింగగిరి రామకృష్ణతో కలిసి టీం కెప్టెన్ చీపు గంగాదర్ ఒక్కో పరుగు చేరుస్తూ మధ్యలో ఫోర్లు, సిక్సర్లతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. లక్ష్య చేధనకు 7 పరుగుల దూరంలో కెప్టెన్ గంగాదర్ అవుట్ కాగా 5వ నంబర్ బ్యాటర్ దార్ల సురేష్ మిగిలిన పని పూర్తి చేసి 13ఓవర్లలో 90 పరుగులు చేదించి మీడియా టింకు విజయానందించారు.బ్యాటింగ్, బౌలింగ్ లో అద్భుతంగా రాణించిన లింగగిరి రామకృష్ణ ఆల్ రౌండర్ పాత్ర పోషించాడు. ఫిల్డింగ్ లో గురవయ్య(10టివి), రాంబాబు(సివిఆర్), మారోజు అశోక్(మహా న్యూస్), బర్ల రామారావు(టివి9), కలవకొలను సతీష్(జర్నలిస్ట్ టివి), రామారావు(ప్రైమ్9న్యూస్) లు రాణించారు,



కీపింగ్ లో బర్రె రామకృష్ణ(రాజ్ న్యూస్) అద్భుతమైన క్యాచ్ లు, స్టంపింగ్ తో ప్రత్యర్ధి బ్యాటర్లను కట్టడి చేశాడు.విజయం సాధించిన మీడియా టీంను విజయవాడ నుంచి వచ్చిన అంతర రాష్ట్ర క్రికెట్ క్రీడాకారులు అభినందించారు. అనంతరం సత్తుపల్లి సీనియర్ జర్నలిస్టు షేక్. ఖాదర్ బాబా(ఆంధ్రప్రభ) చేతుల మీదుగా రన్నర్స్ టీమ్ బెటాలియన్ పోలీస్ క్రీడాకారులకు ట్రోఫీ ని అందించారు. సత్తుపల్లి మీడియా టీమ్ కు విన్నర్స్ ట్రోఫీ ను బహుకరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మీడియా తరుపున బీవీ రామారావు మాట్లాడుతూ సత్తుపల్లి మీడియా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.నిత్యం వార్తల సేకరణ లో బిజీగా గడుపుతూ, ఉద్యోగరీత్యా పోలీసులు కూడా మానసిక ఒత్తిడికి గురికాకుండా క్రికెట్ ఆటతో ఆటవిడుపుగా సరదాగా మానసిక ఉల్లాసం కోసం క్రీడలు చాలా దోహదపడతాయని, అందుకోసం క్రీడల్లో పాల్గొనేందుకు ఉత్సాహవంతంగా ముందుకు రావాలని సూచించారు.

# బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం

**పినపాక ,మహా:**పినపాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులు,గ్రామీణ మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మండల పరిధి లోని పోతిరెడ్డి పల్లి క్రింది గుంపు వాగుపై సుమారు రూ. 65 లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షిస్తూ, నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్రిడ్జి పూర్తయితే పరిసర గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయని, ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని తెలిపారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామీణ అభివృద్ధి దిశగా ఎమ్మెల్యే పాయం అడుగులు వేస్తుండటం పినపాక ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, సర్పంచ్ వాగబోయిన చందర్రావు, ఈ బయ్యారం ఉపసర్పంచ్ సందీప్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరం వెంకటేశ్వర్లు, తోలేం అర్జున్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# మానవత్వం చాటుకున్న పూర్వ స్నేహితులు

**పినపాక, మహా:** పినపాక మండలం పోతూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పున్నం నాగమణి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న 2006-07 పదవ తరగతి పూర్వ విద్యార్థులు మానవత్వం చాటుకున్నారు.తమ స్నేహితురాలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆమె చికిత్స కోసం తమవంతుగా రూ.30,000 నగదు ఆర్థిక సహాయం అందజేశారు. ఆపద సమయంలో తోడుగా నిలిచిన పూర్వ స్నేహితుల దాతృత్వానికి నాగమణి కృతజ్ఞతలు తెలిపారు.సంక్షోభ సమయంలో స్నేహబంధం నిలబెట్టిన ఈ యువకుల చర్య పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



# TGSIIC భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు.!

**రైతులను మభ్యపెట్టి యదేచ్ఛగా వ్యాపారం.. కనీసం కన్నెత్తి చూడని అధికారులు పోలీసులు**
**ఇప్పటికైనా అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలి.. 166లోని ప్రభుత్వ సంపదను అధికారులు కాపాడాలి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**ఎలిమినేడులోని ప్రభుత్వ భూములలో యదేచ్ఛగా మట్టి తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు. ఇబ్రహీంపట్నం మండలం, ఎలిమినేడు గ్రామ రెవెన్యూ పరిధి, ఆమ్లెట్ గ్రామం మేటిలలో సర్వేనెంబర్ 166లో 133 ఎకరాల ప్రభుత్వ భూమి కలదు. ఈ యొక్క భూమిని గతంలో టీజీఎస్ఐఐసి ప్రభుత్వ సంస్థ ఆధీనంలోకి తీసుకోవడం జరిగింది. ఆ యొక్క భూమిలో గతంలో కబ్జాలో ఉన్న రైతులను మభ్యపెట్టి ఎలిమినేడు, జబ్బారిగూడ గ్రామాలకు చెందిన కొందరు అక్రమార్కులు, టీజీఎస్ఐఐసి సంస్థ, జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారుల కన్నుగప్పి, యదేచ్ఛగా మట్టి తవ్వకాలు జరిపి, ప్రభుత్వ సంపదను సొమ్ము చేసుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కనీసం కన్నెత్తి చూడని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారని, ఆ భూములలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని అధికారులకు తెలిపినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



**ప్రభుత్వ సంపదను అధికారులు కాపాడాలి.....**

శుక్ర శనివరాల రాత్రి వేళలో జోరుగా తవ్వకాలు జరుపుతూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. శుక్ర శనివారాలు వారంలో చివర రోజులు కావడం అధికారులు పెద్దగా పట్టించుకోరనే ఉద్దేశంతో, అక్రమార్కులు జోరుగా మట్టి తవ్వకాలు జరుపుతారు. ఇక ఆదివారం అయితే పగలు రాత్రి పూట అక్రమ మట్టి రవాణా జరుగుతుంది. రాత్రి వేళలో పోలీస్ వాహనాల పక్కన నుంచి, మట్టి టిప్పర్లు వెళ్లిన పట్టించుకునే పరిస్థితి లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమాలకు అడ్డుకట్ట వేసి, ప్రభుత్వ సంపదను కాపాడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



## వార్డు సమస్యలు పరిష్కరిస్తాం..

### చైర్మన్ పత్య

**ఆమనగల్లు, మహా :**ఆమనగల్లు పట్టణంలో వివిధ వార్డులలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ అన్నారు. స్థానిక 6వ వార్డులో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు నీటి, రోడ్లు, డ్రైనేజీ సమస్యలు చైర్మన్‌కు వివరించారు. చైర్మన్ పత్య నాయక్ మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు..

## గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

### బాకారం జాగీర్ గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ గ్రామ అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తామని గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆదివారం మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ గ్రామపంచాయతీ పరిధిలోని 8వ వార్డులో ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులతో కలిసి అండర్ డ్రైనేజ్ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో ముందుకు వెళ్తామని గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం కోసం నిరంతరం కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి,వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి,రాధికరాఘవరెడ్డి,ఉమారాణి బిక్షపతి గౌడ్,బంధి అనిల్ కుమార్, ఉపేందర్ యాదవ్,కొండకల్ల రవి, కొండకల్ల అమృతఎల్లయ్య, కొండకల్ల స్వాతి మహేందర్, దినేష్ రెడ్డి, మరియు నాయకులు కొండకల్ల శ్రీకాంత్, రాజేందర్ రెడ్డి,సారా రవి, వడ్డే శివ,బంటు నరసింహ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది మహిపాల్ గ్రామస్థులు పాల్గొన్నారు.





### ఆలయాల నిర్మాణానికి

## భూమి పూజ

**ఆమనగల్లు, మహా :** తలకొండపల్లి మండలం వెంకట్రావుపేటలో ఆదివారం రజకుల ఆరాధ్య దైవాలు మడేలయ్య, ఈదమ్మ ఆలయాల నిర్మాణానికి సర్పంచ్ మహేశ్ గ్రామస్థులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. గ్రామ దేవతల దీవెనలతోనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని చెప్పారు.ఆలయాలను సొంత నిధులతో నిర్మిస్తానని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కెంచ రమేష్ , ఉపసర్పంచ్ పోలె ప్రశాంత్ , వార్డు సభ్యులు తోట శ్రీను, గౌర్ల లింగం,గువ్వ శంకరయ్య ,మొక్తల సంతోష రాజు, గ్రామ పెద్దలు ,గొరిగె వెంకటయ్య ,మొక్తల వెంకటయ్య,మొక్తల ఎల్లయ్య చాకలి సత్యం, బంగారుగడ్డ వెంకయ్య ,లచ్చయ్య ,యాదయ్య ,కృష్ణయ్య య్య ,భీమయ్య ,అయోధ్య, కృష్ణయ్య ,అరుణ్ ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగపల్లిలో కాంగ్రెస్ జోరు: పలు పార్టీల కార్యకర్తల చేరిక

- **వచ్చే ఎన్నికలలో మెజార్టీ స్థానాలు గెలుపొందుతాం**
- **కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆగపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సిపిఎం కార్యకర్తలు. మంచాల మండలం ఆగపల్లి గ్రామానికి చెందిన టీఆర్ఎస్, సిపిఎం పార్టీలకు చెందిన సుమారు 60 మంది కార్యకర్తలు ఏర్పుల సంజీవ్, రాజు ఆధ్వర్యంలో, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన లక్నాల మారయ్య, జక్క రాజు, దూసరి రమేష్, మహ్మద్ అస్లం, తజుముల్, ఆమేర్, మంగలిపల్లి సురేందర్ తదితరులకు, ఎమ్మెల్యే రంగారెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. అనంతరం మంచాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బైరిక రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ... “ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై పెద్ద ఎత్తున నాయకులు కాంగ్రెస్ వైపు వస్తున్నారు” అని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఆదివారం ఆగపల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ చేరికతో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడిందని ఆయన అన్నారు. వచ్చే ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలలో, స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి సారాధ్యంలో, మండలంలో మెజార్టీ స్థానాలను గెలుపొందడం జరుగుతుందని రమాకాంత్ రెడ్డి తెలిపారు.



## రజక కుటుంబంపై అమానుషదాడి.. చర్యలు తీసుకోవాలి:ఆచారి

**ఆమనగల్లు, మహా :**నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో రజక కుటుంబంపై జరిగిన దాడిలో పసిపాప మృతి చెందడం అమానుషం అని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి చెప్పారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసు నమోదు చేసి వారిని వెంటనే అరెస్టు చేయాలనిడిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్రేషియా అందించి వారి కుటుంబంలో మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు.ఆ కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.





### హమాలీల హక్కుల సాధనకు

## పోరాటమే మార్గం

**మంచిర్యాల, మహా :** హమాలీల హక్కుల సాధనకు పోరాటమే మార్గమని హమాలి సంఘం సిఐటియు జిల్లా అధ్యక్షులుగోమాస ప్రకాష్ వెల్లడించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం సారంగపెల్లి గ్రామంలో హమాలీల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని రకాల హమాలీల రక్షణకై సమగ్ర చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాద బీమా పి ఎఫ్, ఇ.ఎస్.ఐ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా కామ్రేడ్ గోమాస ప్రకాష్, అధ్యక్షులుగా శట్టి శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా గోలెం మల్లేష్, కోశాధికారిగా పెద్దపెల్లి వెంకటేశం, ఉపాధ్యక్షులు గా వై రవీందర్, సహాయ కార్యదర్శిగా పెంట రమేష్, కమిటీ సభ్యులుగా పెద్దపల్లి ఓదెలు ,మామిడాల వెంకటేష్ లను ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు.

### కేంద్రమంత్రి బండి సంజయ్ సహకారంతో కరీంనగర్ ను

# అన్ని రంగాల్లో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతాం..

### కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్..

**కరీంనగర్ మహా:** కేంద్రమంత్రి బండి సంజయ్ పాలకవర్గ సభ్యుల సహకారంతో కరీంనగర్ ను రాష్ట్రంలోనే అత్యుత్తమంగా అన్ని రంగాల్లో అత్యద్భుతంగా తీర్చిదిద్దామని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ వెల్లడించారు. ఆదివారంకరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన చాంబర్ లో మేయర్ గా బాధ్యతలు కొలగాని శ్రీనివాస్ స్వీకరించారు. ఆయన చాంబర్ లో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేసి... మేయర్ సీటులో ఆసీనులయ్యారు. మొట్టమొదట ప్రజల త్రాగు నీటి సరఫరా ఇబ్బందులు తొలగించడం, సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా విలీన గ్రామాల డివిజన్ల 49 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు పరిపాలనాపరమైన మంజూరుకు ఫైల్ పై మేయర్ మొదటి సంతకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మీడియాతో మాట్లాడుతూ నగర ప్రజలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనకు మేయర్ పదవి లభించేలా సహకరించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు రాంచంధర్ రావు, జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.. కరీంనగర్ నగరపాలక సంస్థ లో మొట్ట మొదటి సారిగా భారతీయ జనతా పార్టీ నుండి మేయర్ పీఠం దక్కించుకోవడం శుభ సూచకమని పేర్కొన్నారు. కరీంనగర్ ప్రజల సహకారంతో ఈ కళ నెరవేరిందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పాలకవర్గ సభ్యుల సహకారంతో రాబోయే 5 సంవత్సరాల్లో 66 డివిజన్ల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తామని స్పష్టం చేశారు. నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసే దిశగా మేము అడుగులు వేస్తామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, పాలకవర్గ సభ్యుల సహకారంతో నగరాన్ని మరింత సుంధరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు, నగరపాలక సంస్థ లో పౌర సేవలు వేగవంతం గా అందేలా చర్యలు తీస్కుంటామని తెలిపారు.



### ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా

## గూగులోత్ వంశీ ఎన్నిక



**జూలూరుపాడు, మహా:** ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా జూలూరుపాడు మండల పరిధి మచినపేట గ్రామానికి చెందిన గుగులోత్ వంశీ ఎన్నికయ్యారు. అఖిలభారత విద్యార్ధి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర నాల్గవ మహాసభలు నిజాంబాద్ జిల్లా వేదికగా జరిగాయి. ఈ మహాసభల వేదికగా ఈ ఎన్నిక జరిగింది. నూతనంగా విద్యారంగంలో వస్తున్న మార్పుల పై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఈ మహాసభ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నికైన వంశి మాట్లాడుతూ.. విద్యా రంగ సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర సమితి సభ్యుడుగా బాధ్యతలు అప్పగించిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే కోరం దంపతులు

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలం పెద్దమడెంపల్లిలో ఆదివారం జరిగిన ఓణీల అలంకరణ వేడుకకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు హాజరైనారు. ఎమ్మెల్యే మేనకోడలైన సోది సింధుకోటేశ్వరరావు కుమార్తె ఉదయ శ్రీ ఓణీల వేడుకకు హాజరైన కోరం కనకయ్య దంపతులు చిన్నారి ని ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మాజీ వైస్ఎంపిపి మహేష్, మాజీ మున్సిపల్ చైర్మెన్ యదలపల్లి అనసూర్య, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరావు, నర్సింగ్ శ్రీనివాసరావు, అడపా పుల్లారావు, దమ్మలపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## కారేపల్లి లో ఫిజియోథెరపీ శిబిరం విజయవంతం

**కారేపల్లి, మహా:** మిషన్ వాక్ ఫౌండేషన్, మిషన్ వాక్ న్యూరో రిహాబ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలోఈఆదివారం నిర్వహించిన ఉచితంగా ఫిజియోథెరపీ, రిహబిలిటేషన్ శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని సర్పంచ్ మేదరి వీర ప్రతాప్, బానోత్ హీరాలాల్, మాజీ జెడ్పిటిసి వాంకుడోత్ జగన్ లు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల కు చెందిన బాధితులు శిబిరానికి వచ్చి పరీక్షలు నిర్వహించుకున్నారు. ప్రముఖ న్యూరో రిహాబిలిటేషన్ నిపుణులు డాక్టర్ బాధావత్ రవి ఆధ్వర్యంలో వైద్య బృందం రోబో రోగులకు చికిత్స నిర్వహించారు. మిషన్ వాక్ చేయించి రోగులకు మనోధైర్యం కల్పించారు. శారీరకంగా ఇబ్బందులు పడుతున్న వారి కోసం ఈ ఉచిత ఫిజియోథెరపీ శిబిరం ఏర్పాటుచేసినట్లు డాక్టర్ రవి తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారు, హైదరాబాద్ వెళ్లలేక ఫిజియోథెరపీ చేయించలేకపోతున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని కారేపల్లి లో ఉచిత ఫిజియోథెరపీ, రిహబిలిటేషన్ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డుగోడు ఐలయ్య అజ్మీర వీరన్న యాకూబ్ అలీ, తాజుద్దీన్ కళ్యాణ్ పాల్గొన్నారు.



## బుచ్చయ్య పల్లిలో వాలీబాల్ కోర్టు ఏర్పాటు

### ప్రారంభించిన గ్రామ సర్పంచ్ జాడి మహేష్

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు మాజీ వ్యవసాయ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్ నాయకత్వంలోబుచ్చయ్య పల్లి గ్రామపంచాయతీలో వాలీబాల్ కోర్టుకు గ్రామ సర్పంచ్ జాడి మహేష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని గ్రామానికి పన్నెతెచ్చే విధంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. బుచ్చయ్య పల్లి గ్రామపంచాయతీలోమని యువత క్రీడారంగంలో ముందుకు రావడం కోసం యువత కోరిక మేరకు క్రీడలను ప్రోత్సహిస్తున్నగ్రామసర్పంచ్ వాలీబాల్ కోర్టును చదును చేయించి వాలీబాల్ మరియు వాలీబాల్ నెట్ అందించిన గ్రామ సర్పంచ్ జాడి మహేశ్వర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోల వెంకటేష్, జిట్ట వేణి లక్ష్మయ్య తోబాటు వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## చాకలి చంద్రకళ కుటుంబంపై దాడి చేయడం చాలా బాధాకరం..

**నాగర్ కర్నూల్ జిల్లా మహా :** నాగర్ కర్నూల్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి ,ఎమ్మెల్సీ తిన్మార్ మల్లన్న ,పలు ప్రజా సంఘాల ప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ,బాధితులకు వెంటనే న్యాయం చేయాలని పోలీస్ అధికారులను కోరారు పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేశారు.



**మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ**

ఇంత ఘోరమైన ఘటన జరిగినాఫిర్యాదు తీసుకోకపోవడం,కేసు నమోదు చేయకపోవడం చాలా దుర్మార్గం ఇది నిర్లక్ష్యం కాదు. ఇది పాలనా నేరం అధికార పార్టీ నాయకుల మాటే చట్టమై,బలహీన వర్గాల ప్రజల ప్రాణాలు పోయినా కనీసం లెక్క చేయకపోవడంప్రజాపాలన ఇదేనా?ఇదేనా రాజ్యాంగం హామీ ఇచ్చిన సమాన న్యాయం? దాడి చేసిన 8 మంది పై మర్డర్ కేసు నమోదు చేసి రిమాండ్ చెయ్యాలని తక్షణమే చట్టం ముందు నిలబెట్టాలి.ప్రభుత్వ మౌనం,ప్రజా ఆగ్రహాన్ని తప్పనిసరిగా చవిచూస్తుంది.ప్రజల సహనానికి హద్దు ఉంటుంది.ప్రభుత్వం గుర్తుంచుకోవాలి——న్యాయం ఎవరి దయ కాదు.పోలీస్ వ్యవస్థ ఏకపక్షంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదు బాధిత కుటుంబం పిటిషన్ ఇస్తే దాన్ని fir చెయ్యకుండా కోర్టుకు పంపి దాడి చేసిన వారు వచ్చి బాధితులపై పిటిషన్ ఇస్తే బాధితులపై కేసులు నమోదు చెయ్యడం చాలా బాధాకరం బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా 1 లక్ష రూపాయలు,గృహ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే ప్రకటించారు నాగర్ కర్నూల్ నుంచి సంఘటన జరిగిన కుమ్మెర గ్రామానికి పాదయాత్రగా బయలుదేరిన మర్రి జనార్దన్ రెడ్డి మరియు పలువురు బీఆర్ఎస్ నాయకులు. కుమ్మెర గ్రామంలో పసిపాప సమాధిని సందర్శించి నివాళులు అర్పించారు మౌనం పాటించారు. గ్రామంలో దాడి జరిగిన తీరును గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో BRS పార్టీ తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.



రెండు నెలల చిన్నారిని కాలితో తొక్కి హత్య చేసిన కాంగ్రెస్ గూండాలు

**నాగర్ కర్నూలు జిల్లా మహా :** నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం కుమ్మెర మల్లన స్వామి జాతరలో కాంగ్రెస్ సర్పంచ్, అగ్రనాయకులు దాడిలో మృతి చెందిన రెండు నెలల చిన్నారి కుటుంబసభ్యులకు పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి. తక్షణ సాయంగా 1 లక్ష రూపాయలు,గృహ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని ప్రకటించారు కాంగ్రెస్ రౌడీల దాడిలో మృతి చెందిన రెండు నెలల చిన్నారి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసిన బీఆర్ఎస్ శ్రేణులు. నాగర్ కర్నూల్ నుంచి సంఘటన జరిగిన కుమ్మెర గ్రామానికి పాదయాత్రగా బయలుదేరిన మర్రి జనార్దన్ రెడ్డి మరియు పలువురు బీఆర్ఎస్ నాయకులు.ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యే.

## మాజీ ఎమ్మెల్యే, ఆయన తనయుడికి నోటీసులు జారీ.!

- మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలి లేదంటే చర్యలు
- కోర్టు ఆదేశాల మేరకే నోటీసులు జారీ: పోలీసులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి, ఆయన తనయుడు ప్రశాంత్ కుమార్ రెడ్డిలు అందుబాటులో లేకపోవడంతో వాళ్ల ఇంటి గోడలకు నోటీసు అంటించినట్లు వెల్లడించిన పోలీసులు. వారిద్దరిపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో నమోదైన కిడ్నాప్ కేసు క్రింద, క్రైమ్ నెంబర్ 119/2026 యాక్ట్ 1951 ప్రకారం యు/సెక్షన్ 35{5} బిఎన్ఎస్ఎస్ తో పాటు పలు సెక్షన్ల క్రింద 8 కేసులు నమోదయ్యాయి. ఇబ్రహీంపట్నం పోలీస్టేషన్లో కేసులు నమోదు చేసిన పోలీసులు, ఆదివారం నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విలేకరులతో మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 19వ వార్డు సభ్యులు ఆకుల యాదగిరిని మాజీ ఎమ్మెల్యే, ఆయన తనయుడు గత వారం రోజుల క్రింద కిడ్నాప్ చేసి తన మొబైల్ ఫోన్, కౌన్సిలర్ గా గెలిచిన ధ్రువ పత్రాని తీసుకోని మానసికంగా చిత్రహింసలకు గురి చేశారని, ఆకుల యాదగిరి భార్య, ఆయన కొడుకు రాష్ట్ర హైకోర్టులో కేసు వేయడంతో, కోర్టు ఆదేశాల మేరకు విచారణలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, ఆయన కుమారుడిపై పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డిలు వారి స్వగృహాలైన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని, ఎలిమినేడు గ్రామంలో, నగరంలో తిరుమల హిల్స్ లోని ఇళ్ళలో వారు లేకపోవడంతో, రెండు చోట్ల ఇంటి గోడలకు నోటీసులు అంటించినట్లు పోలీసులు వెల్లడించారు. కిడ్నాప్ గురైన సంఘటనపై మూడు రోజులలో తిరిగి వివరణ ఇవ్వకుంటే న్యాయ స్థానం దేశాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని, నోటీసులో పొందుపరిచినట్లు పోలీసులు హెచ్చరించారు.



జై గౌడ ఉద్యమ సంఘం ఆధ్వర్యంలో

## నాగర్ కర్నూల్ మున్సిపల్ గౌడ కౌన్సిలర్లకు ఘన సన్మానం....

**జై గౌడ ఉద్యమ సంఘ జిల్లా మహిళా అధ్యక్షురాలు సోమ ప్రగతి గౌడ్**

**నాగర్ కర్నూల్ జిల్లా మహా :** మున్సిపాలిటీ ఎన్నికల లో నూతనంగా ఎన్నికైన గౌడ కులస్తుల కౌన్సిలర్లకు ఆదివారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ గౌడ కౌన్సిలర్లకు జైగౌడ ఉద్యమ సంఘం నాగర్ కర్నూల్ జిల్లా వారిచే శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జైగౌడ ఉద్యమ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుండ్రాతి నారాయణ గౌడ్ కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులు అన్ని విభాగాలలో ప్రాతినిధ్యం వహించాలని,ప్రజలకు మెరుగ్గా ప్రజా సేవలందించుటకు ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు.జైగౌడ నాగర్ కర్నూల్ జిల్లా ఉద్యమ మహిళ అధ్యక్షురాలు సోమ ప్రగతి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువలో చేర్చుటకు ప్రతి గౌడ కులస్తుడు రాజకీయ,ఆర్థిక,ఉద్యోగ సంక్షేమ విభాగాలలో ముందుండాలని ఆమెకోరారు. నాగర్ కర్నూల్ లో నూతనంగా ఎన్నికైన 19వ వార్డుకౌన్సిలర్ కాటా గౌని సునీత శ్రీనివాస్ గౌడ్ గారిని,మూడో వార్డు నుండి ఎంపికైన వసంత సంతోష్ గౌడ్ గారిని,9వ వార్డ్ కౌన్సిలర్ గా గెలుపొందిన సుంకరి అలివేల,రాజేష్ గౌడ్ గారిని పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానం చేశారు. నాగర్ కర్నూల్ పట్టణ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి ప్రజాసేవలో నూతన కౌన్సిలర్లు ముందుండాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో జై గౌడ ఉద్యమ యూత్ అధ్యక్షులు కటగౌని హరీష్ గౌడ్,ప్రసాద్ గౌడ్,సింగారి జ్యోతి గౌడ్ ,పలుస నిర్మల గౌడ్,గుండ్రాతి సత్యం గౌడ్, కల్పన,సువర్ణ,నిర్మల,యశోద,సుమతమ్మ,విద్య,పుష్ప,శోభ, హేమలత,కవిత,పద్మ,స్రవంతి గౌడ సంఘంనాయకులు మహిళలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ లో సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన చైర్మన్, దొంతగాని శ్రీనివాస్,వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్



**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు విజ్ఞప్తి మేరకు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 21వ వార్డులో ఆదివారం చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ శాఖ పరమైన, వీధి దీపాలు ఏర్పాటు చేయు విభాగము, వాటర్ సప్లై విభాగము, శానిటేషన్ విభాగం,ఇంజనీరింగ్ విభాగంనికి సంబంధించిన మున్సిపల్ శాఖ అధికారులు మరియు 20 మంది సంబంధిత శాఖ సిబ్బంది 21వ వార్డులో క్షేత్రస్థాయి పరిశీలన చేసి ప్రజల సమస్యలను నోట్ చేసుకోవడం జరిగింది

ఈ సందర్భంగా ప్రజల ద్వారా వచ్చిన సమస్యల విషయంలో హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు స్పందిస్తూ నూతనంగా ఏర్పడిన పాలకవర్గం సహకారంతో 21వ వార్డులో ఉన్నటువంటి, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుపరచుటకు,వీధి దీపాలలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడటం,శానిటేషన్ వ్యవస్థను మెరుగుపరుచుటకు,అవసరమగుచోట సిమెంటు రోడ్లు,డ్రైనేజీలు ఏర్పాటు చేయుటకు,పూర్తి సహకారం అందిస్తూ పట్టణంలోని అన్ని వార్డుల్లో కూడా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కృషి చేయుటకు నూతన పాలకవర్గం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని, దేవాలయాల అభివృద్ధి విషయంలో కూడా మంచి దృక్పథంతో ముందుకు వెళ్తామని, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జునరావు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, చైర్మన్ సహకారంతో 21వ వార్డును మరియు పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతూ, అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చూస్తూడ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరుస్తూ, వీధి దీపాలు కొరత లేకుండా,పట్టణంలో పరిశుభ్రతకు,ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వటం జరుగుతుందన్నారు.అన్ని మతాలకు సంబంధించిన దేవాలయాల వద్ద కూడా పరిశుభ్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటామని, తెలియజేసినారునూతన సాంప్రదాయంగా మున్సిపల్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల వద్దకు సమస్యలు తెలుసుకోవడం కోసం రావటంతో సంతోషంతో వార్డు పరిధిలోని ప్రముఖ రైస్ మిల్లర్ కుక్కడపు రామ్మోహన్ రావు చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ని శాలువాలతో తో సన్మానించి సమస్యలు తెలుసు కోవడం కోసం ప్రజల వద్దకు రావటం మంచి సంప్రదాయమని అభినందించడం జరిగిందిఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ పరమైన ఉద్యోగులు, సానిటరీ ఇన్స్పెక్టర్ మెరిగ అశోక్, ఇంజనీరింగ్ విభాగం డి వినోద్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఏ.ఈ రాజశేఖర్, వీధి దీపాల నిర్వహణ, వాటర్ సప్లై శానిటేషన్ సిబ్బంది మరియు మాజీ కౌన్సిలర్ వీర్లపాటి భాస్కర్, స్థానిక ప్రముఖులు కెవిఎన్ మూర్తి, చల్లా కృష్ణయ్య అడ్వకేట్, దోసపాటి నరసింహారావు, త్రిపురం అంజయ్య, ఎల్లవుల సైదులు, ఎర్రంశెట్టి పిచ్చయ్య, ఎస్ కే ఉద్దండు, చలపతిరావు, గొట్టే నాగరాజు యాదవ్,సలిగంటి గణేష్, కొమ్మగాని వెంకటేశ్వర్లు, బొడ్డు గోవింద రావు, యాదగిరి, స్వరూప,నవ్య, అప్పారావు రఫీ, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు

పసి బిడ్డ మరణానికి కారణమైన వారిపై

## కఠిన చర్యలు తీసుకోవాలి

**నాగర్‌కర్నూల్‌ఎస్పీతోఫోన్‌లోమాట్లాడిన తెలంగాణజాగృతిఅధ్యక్షురాలుకల్వకుంట్లకవిత**

**నాగర్ కర్నూల్ జిల్లా మహా** నాగర్ కర్నూల్ బిజినపల్లి మండలంకుమ్మెర మల్లన్న జాతరలో కుల వివక్షతో నిరుపేద రజక కుటుంబంపై జరిగిన దాడిలో పసిపాప మరణించడం అమానుషమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారు ఆందోళన వ్యక్తం చేశారు జాతరకు వెళ్లిన రజక దంపతులు గణేశ్, మౌనిక, రెండు నెలల వారి పసి బిడ్డ, తల్లి, చెల్లిపై దాడి చేయగా ఈ దాడిలో పాప ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమని తెలిపారుపాప తల్లి, కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడి ధైర్యం చెప్పారు.. దాడికి కారణమైన నిందితులను తప్పించేందుకు పోలీసులు నామమాత్రపు కేసులు పెట్టి రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ సందర్భంగా బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు అనంతరం నాగర్ కర్నూల్ ఎస్పీకి కవిత ఫోన్ చేశారు.. కుమ్మెర జాతరలో కులవివక్షతో రజక కుటుంబం పై దాడి చేసి పసి బిడ్డ మృతికి కారకులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.. బాధితులకు న్యాయం చేస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హామీ ఇచ్చారు..

## అంగరంగ వైభవంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

**ఆమనగల్లు, మహా :** కడ్తాల్ మండలం లోని చరికొండ గ్రామంలో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగ జరుగుతున్నాయి.బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండుగగా జరిగింది.స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.రాత్రికి రాథోత్సవ కార్యక్రమం నిర్వహించేందుకు రథాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. కల్యాణమహోత్సవం లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,పిబిసి సభ్యులు బాలాజీ సింగ్,పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్,సర్పంచ్ మహేందర్,ఆలయ ధర్మకర్త చక్రవర్తి శ్రీనివాస చార్యులు, రామ చార్యులు, కృష్ణమా చార్యులు, వేణుగోపాల చార్యులు, తిరుమల కిరణ్ చార్యులు, రంగరాజన్ చార్యులు, ఉప సర్పంచ్ బల్వంత్ రెడ్డి, వార్డు సభ్యులు కందికంటి బాలకృష్ణ గౌడ్, ఈర్లపల్లి మహేష్, కొత్తపల్లి రజిత, కొప్పుల బాలమణి, చిందం బౌరమ్మ, జెల్ల జంగమ్మ మరియు మాజీ సర్పంచ్ లాలకోట నరసింహ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు అద్దాల రాములు గౌడ్, కొప్పుల ఆంజనేయులు గౌడ్, మోహన్ గౌడ్,రామకృష్ణ భక్తులు గ్రామస్థులు తదితరులు పాల్గొనారు.



కామారెడ్డి ఎమ్మెల్యే ఇంటిపై

## దాడి గర్హనీయం

**బీజేపీ నేత సింగిరెడ్డి వెంకట్ రెడ్డి**



**కుషాయిగూడ, మహా:** కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి ఇంటిపై జరిగిన దాడి తీవ్రంగా ఖండనీయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, బోగారం మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటన ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అన్నారు. తెలంగాణలో అరాచక పాలన కొనసాగుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి అంశాలను ప్రశ్నించినందుకే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావును అక్రమంగా అరెస్ట్ చేయడం కూడా ఇదే ధోరణికి నిదర్శనమని అన్నారు. అనవసరంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలను నిర్బంధించడం సరైన చర్య కాదని, ఈ విధమైన రాజకీయ వేధింపులు కొనసాగితే గతంలో టీఆర్ఎస్‌కు ఎదురైన పరిస్థితులే కాంగ్రెస్ పార్టీకి కూడా ఎదురవుతాయని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, రాజకీయ భిన్నాభిప్రాయాలను అణచివేయకుండా ప్రజల సమస్యలపై స్పందించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## తాగునీటి సమస్యలేని వార్డుగా తీర్చిదిద్దుతా..

**10వ వార్డు కౌన్సిలర్ పల్లగొల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్**

**మొయినాబాద్ మహా:** తన వార్డులో మంచినీటి సమస్య లేకుండా చేయడమే తన లక్ష్యమని మొయినాబాద్ మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ పల్లగొల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్ పేర్కొన్నారు. ఇటీవలే 10వ వార్డులోని మంచినీటి బోరు మోటర్ చెడిపోయి కొన్ని రోజులుగా మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతూ.. 10వ వార్డులోని ప్రజలు పలుమార్లు మున్సిపల్ సంబంధిత అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదు. ఇటీవలే మున్సిపల్ ఎన్నికల్లో 10వ వార్డు నుండి పోటీ చేసి గెలిచిన పల్లగొల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్ దృష్టికి వార్డు ప్రజలు తీసుకురావడంతో వెంటనే స్పందించి ఆదివారం సమస్యను మున్సిపల్ సిబ్బందితో మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పల్లగొల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్ మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో వార్డులో తిరుగుతున్నప్పుడు మంచినీటి కోసం వార్డు ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అందుకే గెలిచిన వెంటనే వార్డులోని ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. 10వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని తెలిపారు. వార్డులో మంచినీటి సమస్య పరిష్కారం చేసినందుకు వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ.. కౌన్సిలర్ పల్లగొల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



## పసి బిడ్డను హత్య చేసిన అగ్రకుల దురహంకారులను కఠినంగా శిక్షించాలి

**కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు**

**నాగర్ కర్నూల్ జిల్లా మహా :** కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా అమానవీయంగా కాలితో తన్ని హత్య చేసిన ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులు శ్రీనివాస్ రెడ్డి మధుసూదన్ రెడ్డి సతీష్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి కన్నిరెడ్డి మరికొందరిపై ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతోపాటు హత్యా నేరం కింద కేసు నమోదు చేసి 24 గంటల్లో తక్షణమే రిమాండ్ చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు ఆదివారం కుమ్మెర గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాన్ని కెవిపిఎస్ ప్రజా సంఘాల జిల్లా నాయకత్వంతో కలిసి పరామర్శించారు. ఘటనా పూర్వపరాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం నాగర్ కర్నూల్ డిఎస్పి కార్యాలయంలో డీఎస్పీతో వివిధ సామాజిక ప్రజా సంఘాలు బాధితులతో కలిసి చర్చలు జరిపారు. పోలీసుల నిర్లక్ష్య పాత్రను ఖండిస్తూ డిఎస్పి ఆఫీసు ఎదుట భారీ రాస్తారోకో కార్యాలయం ఎదుటే వందల సంఖ్యలో వివిధ సామాజిక ప్రజా సంఘాల నాయకులు బైఠాయించారు. పెద్దపెట్టను నినాదాలు చేశారు. పోలీసుల నిర్లక్ష్యం నశించాలని అగ్రకుల పెత్తందారులందర్నీ తక్షణమే అరెస్ట్ చేయాలని బాధితకుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు అనంతరం కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ పండగలు ఉత్సవాలలో కులవివక్ష అగ్రకుల దురహంకారంతో ప్రజల మధ్య కులవిద్వేషాలు సృష్టించడం, దేవుడి దగ్గర అందరూ సమానము కాదని అహంకారము ప్రదర్శించడంవల్ల ఈ ఘటన జరిగిందన్నారు దేవుని దగ్గరికి వెళ్లడానికి 100 రూపాయలు ఫీజు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించిన పాపానికి, చెల్లిస్తాం కానీ రషీద్ ఇవ్వండని అడిగినందుకు సుమారు మూడున్నర గంటలపాటు గణేష్ అనే యువకుడిని చితకబాధారని చెప్పారు. తన భర్తను కొట్టవద్దని తన తమ్ముడిని కొట్టవద్దని గణేష్ అక్క కీర్తి భార్య మౌనిక ఎంతగా బ్రతిమిలాడిన కాళ్లు మొక్క దానికి ప్రయత్నం చేసిన కాళ్లతో తన్నారు తప్ప కనికరించలేదు రెండు నెలల పసిబిడ్డ ఉంది నా భర్తను కొట్టకండి చంపకండి అని వేడుకున్న చివరికి ఏమాత్రం కనికరం లేకుండా అమానవీయంగా మానవ మృగంలా రెండు నెలల పసిబిడ్డపై కూడా కాలితో తన్ని క్రూరంగా పసిబిడ్డను హత్య చేశారని చెప్పారు.



## ముదిరాజ్ సంఘం భవనాన్ని ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి

**రాజేంద్రనగర్, మహా :** ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మెరుగు సురేష్ ముదిరాజ్, ఆధ్వర్యంలో ఆదివారం శంషాబాద్ జోన్ పరిధి సిద్ధాంతిలో ముదిరాజ్ సంఘం భవనాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్ ముదిరాజ్, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, బి ఆర్ ఎస్ ఇన్చార్జి కార్తిక్ రెడ్డి, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ ముదిరాజ్, వేణు గౌడ్, అందే బాబయ్య ముదిరాజ్, డిఎల్ పాండు ముదిరాజ్, బైరమోని మల్లేష్ ముదిరాజ్, జిల్లా మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్ ముదిరాజ్, మాజీ జెడ్పిటిసి నిరటి తన్వి రాజు ముదిరాజ్,మాజీ చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్, మాజీ కౌన్సిలర్లు సంజయ్ యాదవ్, ఆర్ గణేష్ గుప్తా, రాచమల్ల సిద్దేశ్వర్, జెల్ పల్లి నరేందర్, బూర్కుంట సతీష్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.





మురళీకృష్ణుని అవతారంలో

## స్వామివారి దర్శనం

**యాదగిరిగుట్ట, మహా:** ప్రముఖ పుణ్య క్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి...ఆదివారం రోజు ఉదయం స్వామివారు మురళీ కృష్ణునిగా అవతారంలో ఆలయ పురవీధుల లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు...భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

**మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసిన మందుముల పరమేశ్వర్ రెడ్డి**

**కుషాయిగూడ, మహా:** ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు కాలనీలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు తక్షణం నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు సూచనల మేరకు ఆయన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారులు, వర్షపు నీటి కాలువలు, తాగునీటి సదుపాయాలు, కమ్యూనిటీ హాల్స్ వంటి మౌలిక సదుపాయాల పనుల వివరాలను అందజేశారు. రహదారులు దెబ్బతిన్న పరిస్థితిలో ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో కమ్యూనిటీ హాల్స్ లేక సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.

**ఉప్పల్ సర్కిల్ పరిధిలో ప్రతిపాదిత పనులు**

చిలకనగర్ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో కల్వర్ట్ నిర్మాణం, సీతారామ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, బీరప్పగడ్డలో శ్మశానవాటికల అభివృద్ధి, రామంతాపూర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ విస్తరణ, బీరప్పగడ్డ-చిలకనగర్-ఉప్పల్ డివిజన్లలో సీసీ రోడ్ల పునర్నిర్మాణం, రామంతాపూర్ భగాయత్ ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణం.



**కాప్రా సర్కిల్ పరిధిలో ప్రతిపాదిత పనులు**

వినాయక్ నగర్ ఫేజ్ -IIలో సీసీ రోడ్డు, యెల్లారెడ్డి గూడలో కాంపౌండ్ వాల్ మరియు బాక్స్ డ్రెయిన్ నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, తల్లా బావి వద్ద ఓపెన్ జిమ్ మరియు వాకింగ్ ట్రాక్, నాగార్జున నగర్-శివసాయి నగర్ ప్రాంతాల్లో శ్మశానవాటిక అభివృద్ధి, వాసవి శివనగర్‌లో సీనియర్ సిటిజన్ భవనం, మంగాపురం మరియు బక్షిగూడ ప్రాంతాల్లో డ్రెయిన్ మరియు సీసీ రోడ్లు, మల్లాపూర్ డివిజన్ పరిధిలో పలు కాలనీలలో సీసీ రోడ్లు మరియు ఆర్‌సీసీ పైప్‌లైన్ నిర్మాణం వంటి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత పనులకు తక్షణ పరిపాలనా అనుమతులు మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు

- గరీబోళ్లకు అపర సంజీవిని నిలయాలు
- 100 మందికి కంటి వైద్య పరీక్షలు
- సంఘ సేవకుడు బూడిద వెంకటేష్

కుషాయిగూడ, మహా : ఉచిత వైద్య శిబిరాలు.... గరీబోళ్లకు అపర సంజీవని నిలయాలుగా నిలుస్తున్నాయని, మానవాళికి కంటిచూపు అత్యంత సున్నితమైనదని సంఘ సేవకుడు మదర్ తెరిసా కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్ అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జవహర్ నగర్ లోని మదర్ తెరిసా కాలనీలో విన్ విజన్ హాస్పిటల్, ఎం ఎం ఫౌండేషన్, బాలవికాస ఆధ్వర్యంలో వెంకటేష్ సమక్షంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో ప్రజలు ఆరోగ్యం పై దృష్టి సారించాలని ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని అన్నారు. సర్వేంద్రియానం నయనం ప్రధానమని సర్వ ఇంద్రియాలకు నయనాలే ప్రధాన అవయవాలని ఆ నయనాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మన శరీరంలో సున్నితమైన అవయవం కనులేనని, కంటి ఆరోగ్య రక్షణకు ప్రతి ఒక్కరు తగిన సూచనలు పాటించాలన్నారు. అనంతరం వందమందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శివ నారాయణ, నరేష్, స్రవంతి, హేమవతి, వసంత, వినోద, రవి, మంజుల, చంద్రకళ, నాగమణి, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ హక్కుల కోసం భారీ పోరాట ర్యాలీ

**సీఎం హామీ అమలు చేయాలని బీజేపీ డిమాండ్**

**కుషాయిగూడ, మహా:** రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీ బోడుప్పల్‌లో విజయవంతంగా ముగిసింది. ఆర్ఎన్ఎస్ కాలనీలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ, బోడుప్పల్‌లోని నందమూరి తారక రామారావు విగ్రహం వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో బాధిత కుటుంబాలు, స్థానికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేడ్చల్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జవహర్‌నగర్ ప్రజలకు ఇచ్చిన రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కార హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయలేదని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. సంవత్సరాలుగా బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారి ఆస్తి హక్కులను రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. మన హక్కుల కోసం మనమే పోరాటం. న్యాయం దక్కే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుంది అని అన్నారు.



## ఫారెక్స్ ఆల్‌టైమ్ హై.. బంగారం 128.46 బిలియన్ డాలర్లు



**ముంబై:** విదేశీ మారకం నిల్వలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరుకున్నాయి. ఫిబ్రవరి 13తో ముగిసిన వారంలో 8.66 బిలియన్ డాలర్ల మేర పెరిగి 725.72 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ఆర్‌బీఐ వెల్లడించింది. అంతకుముందు ఫిబ్రవరి 6తో ముగిసిన వారంలో విదేశీ మారకం నిల్వలు 6.71 బిలియన్ డాలర్ల మేర తగ్గి 717.06 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. ఈ ఏడాది జనవరిలో నమోదైన 723.77 బిలియన్ డాలర్లు పూర్వపు గరిష్ట స్థాయిగా ఉంది. ఫిబ్రవరి 13తో ముగిసిన వారంలో కరెన్సీ ఆస్తులు (విదేశీ మారకం నిల్వల్లో అధిక భాగం) నికరంగా 3.55 బిలియన్ డాలర్లు పెరిగి 573.60 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్లతోపాటు, యూరో, పౌండ్, యెన్ రూపంలో విదేశీ కరెన్సీ ఆస్తులున్నాయి. బంగారం రూపంలో మారకం నిల్వలు 4.99 బిలియన్ డాలర్ల మేర పెరిగి 128.46 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) 103 మిలియన్ డాలర్లు పెరిగి 18.92 బిలియన్ డాలర్లకు చేరాయి.

## రియల్ ఎస్టేట్ సంస్థలకు రెరా వార్నింగ్.. నోటీసులు



**హైదరాబాద్:** ఇళ్లు/ఫ్లాట్/యూనిట్ విక్రయాల కోసం తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) రిజిస్ట్రేషన్ లేకుండా కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ముందస్తు ప్రకటనలు ఇచ్చి మోసం చేయొద్దని ప్రమోటర్లు, డెవలపర్లు, ఏజెంట్లతో పాటు ప్రచార మాధ్యమాలను తెలంగాణ రెరా అథారిటీ హెచ్చరించింది. రెరా చట్టం ప్రకారం నిర్మిత స్థలం 500 చదరపు మీటర్లకు మించినా, యూనిట్ల సంఖ్య 8 కంటే ఎక్కువగా ఉన్నా సంబంధిత ప్రాజెక్టును తప్పనిసరిగా రెరాలో నమోదు చేయించాలని సూచించింది. రెరా అథారిటీ ప్రాజెక్టు వివరాలను పరిశీలించి, రిజిస్ట్రేషన్ నంబర్ జారీ చేస్తుందని తెలియజేసింది. రిజిస్ట్రేషన్ నంబర్ పొందిన తర్వాతే విక్రయాలను ప్రోత్సహించడానికి ప్రకటనలు జారీ చేయాల్సి ఉంటుందని ప్రమోటర్లు/డెవలపర్లు, ఏజెంట్లు, ప్రచార మాధ్యమాలను కోరింది. రిజిస్ట్రేషన్ నంబర్ పొందకుండానే చట్టవిరుద్ధమైన ప్రకటనలు జారీ చేసిన పలు సంస్థలకు షోకాజ్ నోటీసులను జారీ చేసినట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. నోటీసులు అందుకున్న సంస్థల్లో గోద్రెజ్ ప్రాపర్టీస్, నవనామి ఎలివేట్ ప్రాజెక్టు, వర్టెక్స్ విరాట్ ప్రాజెక్టు, స్వర్గసీమ అమేయ ప్రాజెక్టు, తిరుమల హిల్స్ తదితర సంస్థలు ఉన్నాయి. కొన్ని కంపెనీలు రెరా రిజిస్ట్రేషన్ నంబర్ పొందుపరిచినప్పటికీ.. ప్రకటనల్లోని సమాచారం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టు గుర్తించింది. స్వర్గసీమ కన్‌స్ట్రక్షన్ చేపట్టిన అమేయ ప్రాజెక్టు ప్రకటనలో అక్షరాల పరిమాణం, ప్రాజెక్టు పూర్తి పేరు విషయంలో వైరుధ్యాలతో పాటు ప్రాజెక్టును లేఅవుట్‌గా రిజిస్టర్ చేసినట్టు గుర్తించింది. ప్రకటనలో మాత్రం నివాస ప్రాజెక్టుగా పేర్కొంటూ కొనుగోలుదారులను తప్పుదోవ పట్టించినందుకు నోటీసులు జారీ చేసింది.

## ప్రైవేటు బ్యాంకులో రూ .590 కోట్ల ఫ్రాడ్..




ప్రముఖ ప్రైవేటు రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో (IDFC First Bank) రూ. 590 కోట్ల ఫ్రాడ్ వెలుగులోకి వచ్చింది. చండీగఢ్‌లోని ఒక బ్రాంచ్‌లో హర్యానా ప్రభుత్వ ఖాతాలకు సంబంధించి అనధికారిక, మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు బ్యాంక్ వెల్లడించింది. బ్యాంక్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. హర్యానా ప్రభుత్వంలోని ఒక నిర్దిష్ట విభాగం నుంచి సమాచారం అందిన అనంతరం ప్రాథమిక అంతర్గత విచారణ చేపట్టగా ఈ అక్రమాలు బయటపడ్డాయి. చండీగఢ్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు అనధికారిక కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తించినట్లు పేర్కొంది. ఈ వ్యవహారంలో ఇతర వ్యక్తులు, సంస్థలు లేదా కౌంటర్ పార్టీల ప్రమేయం కూడా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటివరకు గుర్తించిన ఖాతాల్లో మొత్తం రూ. 590 కోట్ల మేర ప్రభావం ఉన్నట్లు అంచనా వేసిన బ్యాంక్.. పూర్తి వివరాలు, క్లెయిమ్‌ల ధ్రువీకరణ అనంతరం తుది ప్రభావాన్ని వెల్లడిస్తామని స్పష్టం చేసింది. ఈ ఘటన చండీగఢ్ బ్రాంచ్ ద్వారా నిర్వహించబడుతున్న హర్యానా ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని ప్రభుత్వలింక్డ్ ఖాతాలకు మాత్రమే పరిమితమైందని ప్రాథమిక విచారణలో తేలినట్లు పేర్కొంది. ఇతర ఖాతాదారులపై ప్రభావం లేదని బ్యాంక్ వెల్లడించింది. హర్యానా ప్రభుత్వంలో ఓ విభాగం తన ఖాతాను మూసివేసి నిధులను మరొక బ్యాంకుకు బదిలీ చేయాలంటూ చేసిన అభ్యర్థనతో ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఆ ప్రక్రియలో ఖాతా బ్యాలెన్స్‌తో పోలిస్తే గణనీయమైన వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. అనంతరం మరికొన్ని ప్రభుత్వ విభాగాలు కూడా తమ ఖాతాల వివరాలపై బ్యాంకును సంప్రదించగా, బ్యాంక్ రికార్డులు, రాష్ట్ర ప్రభుత్వ లెక్కల మధ్య పలు తేడాలు ఉన్నట్లు తెలిసింది. దర్యాప్తు పూర్తయ్యే వరకు నలుగురు అనుమానిత అధికారులను సస్పెండ్ చేసినట్లు బ్యాంక్ వెల్లడించింది. వర్తించే చట్టాల ప్రకారం సంబంధిత ఉద్యోగులు, ఇతర బయటి వ్యక్తులపై కఠినమైన క్రమశిక్షణా, సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఈ ఘటనను మోసాల కేసుల పర్యవేక్షణ, అనుసరణ బోర్డు (SCBMF) ప్రత్యేక కమిటీ ముందుంచినట్లు పేర్కొన్న బ్యాంక్.. స్వతంత్ర ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించేందుకు బాహ్య ఏజెన్సీని నియమించే ప్రక్రియలో ఉన్నట్లు వెల్లడించింది. ఈ ఘటన బ్యాంకింగ్ రంగంలో సంచలనం సృష్టించగా, పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.




## ఫార్మా ఎగుమతుల్లో వృద్ధి

**న్యూఢిల్లీ :** గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఫార్మా ఎగుమతులు 30.47 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 9.4 శాతం వృద్ధి సాధించింది. గత కొన్నేండ్లుగా సింగిల్ డిజిట్‌కు పరిమితమైన వృద్ధి.. వచ్చే ఏడాది మాత్రం రెండంకెల వృద్ధిని సాధించాలని ఫార్మా ఇండస్ట్రీ వర్గాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ఫార్మా రంగం 60 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండగా, 2030 నాటికి రెండింతలు పెరిగి 130 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నారు. భారత్ ప్రస్తుతం 200 దేశాలకు ఔషధాలను ఎగుమతి చేస్తున్నది.

## ప్రీమియం ఫీచర్లతో బడ్జెట్ ధరల్లో కొత్త స్మార్ట్ ఫోన్




చైనా మొబైల్ తయారీ సంస్థ ఇన్ఫినిక్స్ బడ్జెట్ ధరల్లో కొత్త స్మార్ట్ ఫోన్ తీసుకువచ్చింది. 'ఇన్ఫినిక్స్ నోట్ ఎడ్జ్ 5జీ' పేరుతో భారత మార్కెట్‌లో విడుదల చేసింది. 6 జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 21,999గా, 8 జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 23,999గా, 8 జీబీ ర్యామ్, 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 25,999గా నిర్ణయించారు. లాంచ్ ఆఫర్‌లో భాగంగా 12 నెలల సాధారణ వారెంటీతో పాటు 12 నెలల ఎక్స్‌టెండెడ్ వారెంటీ సదుపాయాన్ని కంపెనీ కల్పిస్తోంది. వన్‌టైమ్ స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఆఫర్‌ను కూడా అందిస్తోంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకు కార్డుల ద్వారా చేసే కొనుగోళ్లపై రూ.2 వేల వరకు అదనపు డిస్కౌంట్ లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌తో పాటు కంపెనీ వెబ్‌సైట్, ఆఫ్ లైన్ స్టోర్స్‌లో ఈ ఫిబ్రవరి 25నుంచి సేల్ అందుబాటులో ఉండనుంది. సిల్క్ ఫైబర్ ఫినిష్, స్టెల్లర్ బ్లూ, లూనార్ టైటానియం కలర్స్‌లో మూడు వేరియంట్లలో లభిస్తుంది. ఇందులో 6.78 అంగుళాల 1.5కే త్రీడీ కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, మీడియాటెక్ డైమెన్సిటీ 7100 ప్రాసెసర్, ఐపీ65 వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెన్స్ సర్టిఫికెట్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఎక్స్‌ఓఎస్ 16 ఆపరేటింగ్ సిస్టం తదితర ఫీచర్లు ఉన్నాయి. వెనకవైపు 50 మెగా పిక్సెల్ మెయిన్ కెమెరాతో పాటు 8 మెగా పిక్సెల్ అల్ట్రా వైడ్ లెన్స్‌తో కూడిన డ్యుయల్ కెమెరా సెట్ అప్ ఉంది. ముందువైపు సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 13 మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 6500 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 45డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో వస్తోంది. 5జీ, డ్యూయల్ 4జీ వీఓఎల్ఈటీ కనెక్టివిటీ సపోర్టులున్నాయి. వై-ఫై, బ్లూటూత్ 5.4, జీపీఎస్, ఎన్ఎఫ్‌సీ ఉన్నాయి. యూఎస్‌బీ టైప్-సీ పోర్ట్, ఐఆర్ సెన్సార్ ఉన్నాయి. ఇన్-డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సార్‌లున్నాయి.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## ట్రంప్ టారిఫ్ టాప్ లేపిన భారతీయ న్యాయవాది

### సుప్రీంకోర్టులో సుంకాల సమరంలో విజయం సాధించిన లాయర్ నీల్ కత్యాల్
### చిన్న వ్యాపారుల తరపున వాదించి గెలిచిన కత్యాల్



**న్యూయార్క్:** ప్రపంచ దేశాలపై సుంకాల సుత్తితో మోదిన అధ్యక్షుడు ట్రంప్‌ను తప్పుబడుతూ అమెరికా దేశ సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పు వెనుక భారతీయమూలాలున్న న్యాయవాది నీల్ కత్యాల్ కృషి సైతం దాగి ఉంది. ట్రంప్ అధిక సుంకాల విధానాలతో వ్యాపారం దారుణంగా దెబ్బతింటోందని కొత్తగా పెంచిన టారిఫ్‌లను తొలగించాలంటూ సుప్రీంకోర్టులో కేసులు వేసిన అమెరికా చిరు వ్యాపారుల తరపున లాయర్ నీల్ కత్యాల్ వాదించి నెగ్గారు. కేసు గెలిచాక నీల్ శుక్రవారం తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో విజయం అని ఒక పోస్ట్ పెట్టారు. తర్వాత ఎంఎస్‌నౌకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ''అమెరికా వ్యవస్థలోని గొప్పతనాల్లో ఒకటి నేడు అందరికీ కన్పించింది. వలసదారుల సంతానమైన నేను నేరుగా సుప్రీంకోర్టులో చిరువ్యాపారుల తరపున వాదించా. అధ్యక్షుడు చట్ట వ్యతిరేక పనులు చేస్తున్నారని గట్టిగా చెప్పా. బలంగా ప్రశ్నించే అవకాశం ప్రభుత్వ లాయర్లు ఇచ్చా. ఇరువైపులా గట్టి వాదనలే జరిగాయి. చివరకు మాకు అనుకూలంగానే జడ్జీలు ఓటేశారు. మేమే గెలిచాం. అధ్యక్షుడు అత్యంత శక్తివంతుడై ఉండొచ్చేమోగానీ రాజ్యాంగాన్ని అతిక్రమించకూడదు'' అని అన్నారు. ''టారిఫ్‌లను తప్పుబడుతూ అమెరికా సుప్రీంకోర్టు చట్టానికి అండగా నిలబడింది. ప్రతి ఒక్క అమెరికన్‌కూ భరోసా ఇచ్చింది. తీర్పు ద్వారా కోర్టు ఒక చక్కటి సందేశం ఇచ్చింది. అదేంటంటే దేశాధ్యక్షుడు శక్తివంతమైన నేత. కానీ రాజ్యాంగం అంతకంటే శక్తివంతమైంది. అమెరికాలో ఉభయ చట్టసభలు (కాంగ్రెస్) మాత్రమే అమెరికన్లపై పన్నులు మోపగలదు. ఈ చట్టపర కేసు ద్వారా మనమేం కోరవచ్చో సుప్రీంకోర్టు పరోక్షంగా వెల్లడించింది. ఈ న్యాయపోరాటంలో లిబర్టీ జస్టిస్ సెంటర్ నాయకత్వం ట్రంప్‌కు ఎదురునిలిచి పోరాడింది'' అని కొనియాడారు. '' అధ్యక్షుడిగా ఎవరున్నాసరే అధ్యక్ష స్థానం అధికారాల పరిధిని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఇది రాజకీయాలు చేయాల్సిన సందర్భంగా కాదు. గత రెండున్నర శతాబ్దాలుగా అత్యంత మౌలిక విలువలను పరిరక్షిస్తూ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు పెద్దన్నలా వ్యవహరిస్తోంది'' అని అన్నారు.

### క్లర్క్.. లాయర్.. ప్రొఫెసర్.. సొలిసిటర్ జనరల్..

1970లో కత్యాల్ అమెరికాలోని షికాగోలో జన్మించారు. నీల్ తల్లిదండ్రులు చాన్నాళ్ల క్రితమే భారత్ నుంచి అమెరికాకు వలసవెళ్లారు. తల్లి పిల్లల వైద్యురాలుకాగా తండ్రి ఇంజనీర్. యేల్ న్యాయ విశ్వవిద్యాలయంలో నీల్ లా చదివారు. గతంలో యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ (సెకండ్ సర్క్యూట్)లో గీడో కలాబ్రెసోకు క్లర్క్‌గా పనిచేశారు. తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్టీఫెన్ జి.బ్రేయర్‌కు సహాయకునిగా సేవలందించారు. జార్జ్‌టౌన్ యూనివర్సిటీ లా సెంటర్‌లో 20 సంవత్సరాలకుపైగా న్యాయశాస్త్ర అధ్యాపకునిగా పాఠాలు బోధించారు. అత్యంత పిన్నవయసులో ఇన్నేళ్లు లా ప్రొఫెసర్‌గా కొనసాగిన అతికొద్ది మందిలో ఈయన కూడా ఒకరని యూనివర్సిటీ పొగిడింది. హార్వార్డ్, యేల్ న్యాయ విశ్వవిద్యాలయాల్లో నీల్ విజిటింగ్ ప్రొఫెసర్‌గానూ పనిచేస్తున్నారు. నీల్ గతంలో అమెరికా నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో తాత్కాలిక సొలిసిటర్ జనరల్‌గా సేవలందించారు. 1998-99 కాలంలో డెప్యూటీ అటార్నీ జనరల్‌కు ప్రత్యేక సహాయకునిగా ఉన్నారు. తర్వాత న్యాయశాఖలోని డెప్యూటీ అటార్నీ జనరల్ ఆఫీస్‌లో జాతీయ భద్రతా సలహాదారుగా సేవలందించారు. మిల్‌బ్యాంక్ ఎల్ఎల్‌పీ వారి వాషింగ్టన్ డీసీ ఆఫీస్‌లో నీల్ భాగస్వామిగా కొనసాగుతున్నారు. లిటిగేషన్ అండ్ ఆర్బిట్రేషన్ గ్రూప్‌లో సభ్యునిగా ఉన్నారు. నీల్ ఇప్పటికేదాకా సుప్రీంకోర్టులో 54 కేసులు వాదించారు. 2011లో న్యాయశాఖ ఇచ్చే అత్యున్నత పురస్కారం 'ఎడ్మాండ్ రాన్‌డాల్ఫ్'ను అందుకున్నారు. 2011, 2014లో అమెరికా సుప్రీంకోర్టు నీల్‌ను ఫెడరల్ అప్పీలేట్ రూల్స్ అడ్వజరీ కమిటీకి ఎంపికచేసింది.



## ట్రంప్‌నకు షాకిచ్చిన అమెరికన్లు?.. సర్వేలో ఏముందంటే..

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహారం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అమెరికా గ్రేట్ ఎగేన్ అంటూ నానా హడావిడీ చేస్తూ.. అధిక పన్నులు పెంచుతూ ఇలా పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ ప్రపంచ దేశాలని ఇబ్బందులకు గురిచేశారు. అయితే తాజాగా ఆయన నిర్ణయాలపై అమెరికాలోనూ తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిపిన సర్వేలలో 60 శాతం అమెరికన్లు ట్రంప్ పాలన పట్ల అసంతృప్తితో ఉన్నట్లు పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు దెబ్బమీద దెబ్బ తాకుతుంది. ఇటీవల ఆయన పలు దేశాలపై విధించిన అధిక పన్నులు చెల్లవని అమెరికా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. అయితే కోర్టు నిర్ణయంపై ట్రంప్ గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు మరో షాక్ తగిలింది. అక్కడి ప్రముఖ మీడియా సంస్థలైన ఏబీసీ న్యూస్, వాషింగ్టన్ పోస్ట్, ఐపీవోస్ నిర్వహించిన సర్వేలలో ప్రతి ముగ్గురు అమెరికన్లు ఆయన పాలనపై వ్యతిరేకంగా ఉన్నట్లు చెబుతున్నాయి. ద్రవ్యోల్బణం విషయంలో ప్రతి ముగ్గురిలో ఇద్దరు ఆయనకు వ్యతిరేకంగా ఉండగా, ఇతర దేశాలతో సంబంధాల విషయంలో 62 శాతం ప్రజలు ఆయన పాలనను నిరాకరిస్తున్నారు. అదే సమయంలో ఇటు పన్నుల విషయంలో పది మందిలో ఆరుగురు ఆయన విధానాలను నిరాకరిస్తున్నట్లు సర్వేలో అవగతమైంది. మొత్తంగా ట్రంప్ పాలన పట్ల 60 శాతం ప్రజలు వ్యతిరేకతతో ఉండగా.. ట్రంప్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమెరికా పరిస్థితులు మరింత దిగజారాయని దాదాపు 50 శాతం మంది అమెరికన్లు భావిస్తున్నట్లు సర్వేలో పాల్గొన్నవారి అభిప్రాయాలు వెలుగులోకి వచ్చాయి. అయితే ఈ వ్యవహారంలో ప్రతిపక్ష పార్టీ డెమోక్రట్ల నేతలపై సైతం అక్కడి ప్రజలు విశ్వసనీయతతో లేరు. ఓవరాల్ గా ట్రంప్ కు 33 శాతం, డెమోక్రట్స్ కి 31శాతం, ఇతరులకు 31శాతం మంది మొగ్గుచూపారు.

## ట్రంప్ నివాసంలోకి చొరబాటుకు యత్నం.. సిబ్బంది కాల్పులు

ఫ్లోరిడాలోని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసం మార్-ఎ-లాగో వెలుపల కాల్పులు జరిగాయి. ఆయుధంతో లోపలికి చొరబడడానికి ఓ దుండగుడు యత్నించగా అతనిపై సీక్రెట్ ఏజెంట్ కాల్పులు జరిపారు. అతనికి గాయాలపై అక్కడే కుప్పకూలారు. కాల్పులకు యత్నించిన సదరు దుండగుడు భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో మృతిచెందాడు. ఈ ఘటన అనంతరం అధ్యక్షుడి నివాసం ఎదుట భద్రత కట్టుదిట్టం చేశారు. ట్రంప్ నివాస ప్రాంతం మార్-ఎ-లాగో పరిసరాలను FBI అదుపులోకి తీసుకుంది. దాడి నేపథ్యంలో ఫామ్ బీచ్ ప్రాంతంలో రాకపోకలను తాత్కాలికంగా అధికారులు నిలిపివేసారు. అయితే అధ్యక్షుడు ప్రస్తుతం సురక్షితంగా ఉన్నారని తెలిపారు. అయితే ట్రంప్ నివాసంలోకి ఆ దుండగుడు ఎందుకు చొరబడటానికి యత్నించాడనే కారణాలు తెలియాల్సి ఉంది.

## యూఎస్ పట్టభద్రుల్లో హిందువులే ఎక్కువ

**వాషింగ్టన్:** అగ్రరాజ్యం అమెరికాలో ఎక్కువ మంది ఉన్నత విద్యావంతులు, పట్టభద్రులు ఏ మతస్థులో తెలుసా? అందరూ అనుకుంటున్నట్లు క్రైస్తవులు కాదు. హిందువులే అగ్రస్థానంలో ఉన్నారు. వాషింగ్టన్‌కు చెందిన ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజాగా ఈ విషయం వెల్లడించింది. నాలుగేళ్ల కాలేజీ డిగ్రీ పూర్తిచేసిన పట్టభద్రులు ఏ మతానికి చెందిన వారన్న దానిపై 2023-24 రిలీజియస్ ల్యాండ్‌స్కేప్ స్టడీ (ఆర్ఎల్ఎస్) పేరిట ఈ సంస్థ విస్తృతంగా అధ్యయనం చేసింది. ఉన్నత విద్యావంతుల్లో అగ్రస్థానంలో హిందువులు, ఆ తర్వాతి స్థానంలో యూదులున్నట్లు తన నివేదికలో పేర్కొంది. అమెరికాలో ప్రతి 10 మంది హిందువుల్లో కనీసం ఏడుగురు బ్యాచిలర్స్ డిగ్రీ లేదా ఉన్నత విద్య అభ్యసించారు. అంటే 70 శాతం శాతం మంది ఉన్నత విద్యావంతులే. యూదుల్లో ఈ సంఖ్య 65 శాతం. స్థానిక అమెరికన్లలో కేవలం 35 శాతం మంది ఉన్నత విద్య అభ్యసించారు. ఇతర మతస్థులు సగటు కంటే కొద్దిగా పైస్థానంలో నిలిచారు. వీరిలో ముస్లింలు, బౌద్ధులు, ఆర్థోడాక్స్ క్రైస్తవులున్నారు. ఆయా మతస్థుల్లో ప్రతి పది మందిలో కనీసం నలుగురు బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ప్రొటెస్టంట్ క్రైస్తవులు కూడా ఈ జాబితాలో నిలిచారు. ఎవెలాంజికల్ ప్రొటెస్టంట్లు, క్యాథలిక్స్ సగటు కంటే దిగువ స్థాయిలో ఉన్నారు. వీరు చాలావరకు నల్లజాతివారే. మొత్తం స్థానిక అమెరికా జనాభాలో పరిశీలిస్తే ప్రతి పది మందిలో నలుగురు మాత్రమే బ్యాచిలర్స్ డిగ్రీ అభ్యసించారు. అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం విషయంలో మతాల మధ్య చాలా వ్యత్యాసాలు ఉన్నట్లు తెలుస్తోంది. వలసలు, తద్వారా స్థానిక జనాభా స్థితిగతుల్లో మార్పులు రావడమే ఈ వ్యత్యాసాలకు కారణమని ప్యూ రీసెర్చ్ సెంటర్ తమ నివేదికలో అభిప్రాయపడింది. హిందువులు, ముస్లింలు, బౌద్ధులు చాలావరకు ఇతర దేశాల అమెరికాకు వలస వచ్చినవారే కావడం గమనార్హం. వీరు ఉన్నత విద్య లేదా ఉద్యోగాల కోసం, జీవనోపాధి కోసం వచ్చారు. అమెరికాలో ఉద్యోగాల కోసం భారతీయులు అధికంగా తరలివస్తున్నారు. ఇందుకు హెచ్-1బీ వీసాలు వారికి తోడ్పడుతున్నాయి. ఈ వీసాలో అత్యధికంగా ప్రయోజనం పొందుతున్నది భారతీయులే కావడం గమనార్హం. అమెరికాలో టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ, విద్యా రంగాలను భారతీయులు ప్రభావితం చేస్తున్నారు.







# రజనీ సరసన ఆ ఇద్దరు ముద్దుగుమ్మలు?

ఏడుపదుల వయసు దాటినా వరుసగా చిత్రాలు చేసుకుంటూ పోతున్న నటుడు రజనీకాంత్. నిజం చెప్పాలంటే ఇటీవల మంచి విజయాన్ని చూసి చాలా కాలమే అయ్యింది. జైలర్ చిత్రం మినహా మంచి సక్సెస్ కాలేదు. రజనీకాంత్ ఈ మధ్య కాలంలో నటించిన వేట్టయన్, కూలీ చిత్రాలు అంచనాలను అందుకోలేకపోయాయి. అయినా ఈయన వరుసగా చిత్రాలు చేసుకుంటూ పోతున్నారు. ప్రస్తుతం జైలర్–2 చిత్రాన్ని పూర్తిచేసిన రజనీకాంత్ తాజాగా ఆయన 173వ చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రాన్ని ఆయన సహనటుడు కమలహాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించడం విశేషం. దీనికి సిబి చక్రవర్తి దర్శకత్వం వహిస్తున్నారు. రజినీకాంత్ ఆస్థాన సంగీత దర్శకుడు అనిరుధ్ బాణీలు కడుతున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్‌కు జంటగా నటించే కథానాయకి ఎవరన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఇటీవల రజనీకాంత్ నటిస్తున్న చిత్రాల్లో సపోర్టింగ్ పాత్రలో ఇతర భాషలకు చెందిన ప్రముఖ తారలు నటించడం ఆనవాయితీగా మారింది. మరి ఇందులోనూ అలాంటి నటీనటులు నటించే అవకాశం లేకపోలేదు. ఈ విషయం పక్కన పెడితే ఇందులో నటి పూజా హెగ్డే, ప్రియాంక మోహన్ నటించబోతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం వైరల్ అవుతోంది. అయితే ఈ ముద్దుగుమ్మలు సహజంగా పోషించే గ్లామర్ పాత్రలు కాకుండా నటనకు అవకాశం ఉన్న బలమైన పాత్రల్లో నటించబోతున్నట్లు ప్రచారం వైరల్ అవుతోంది. వీటితోపాటు ఒక సీనియర్ నటి కూడా నటించబోతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన అధికారిక సమాచారం త్వరలో వెలువడే అవకాశం ఉంది.





## చిరంజీవితో సమానంగా అల్లు అర్జున్..

కొచ్చి వేదికగా 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ వేడుకలో పుష్ప2 చిత్రం సత్తా చాటింది. తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ పరిశ్రమ నుందచి 2024 ఏడాదిలో విడుదలైన సినిమాలకు సంబంధించిన నటీనటులకు తాజాగా అవార్డులు అందజేశారు. అందులో భాగంగా అల్లు అర్జున్ సౌత్ ఉత్తమ నటుడిగా పుష్ప2 చిత్రానికి గాను పురష్కారాన్ని అందుకున్నారు. ఆపై పుష్ప2 ఏకంగా ఐదు విభాగాల్లో అవార్డ్స్ కొల్లగొట్టి రికార్డ్ క్రియేట్ చేసింది. టాలీవుడ్ నుంచి అత్యధికంగా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ అందుకున్న నటుడిగా మెగాస్టార్ చిరంజీవి(7) ఉన్నారు. అయితే, తాజాగా చిరంజీవితో పాటు సమానంగా ఏడు ఫిలిం ఫేర్ అవార్డులు అందుకున్న హీరోగా బన్నీ నిలిచారు. కానీ, ఫిల్మ్‌ఫేర్ నుంచి లైఫ్ టైమ్ అచీవ్ మెంట్, స్పెషల్ లెజెండ్ అవార్డులను చిరు కలిగి ఉండటం విశేషం.

**అల్లు అర్జున్ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్**

1. పరుగు (2008)
2. వేదం (2010)
3. రేసుగుర్రం (2014)
4. పుష్ప: ది రైజ్ (2021)
5. పుష్ప 2: ది రూల్ (2024)
6. రుద్రమదేవి (గోన గన్నారెడ్డి పాత్రకు 2015)
7. సరైనోడు (2016) ఉత్తమ నటుడు క్రిటిక్స్ ఛాయిస్

**చిరంజీవి అందుకున్న ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ :**

1. శుభలేఖ (1982)
2. విజేత (1985)
3. ఆపద్బాంధవుడు (1992)
4. ముఠా మేస్త్రి (1993)
5. స్నేహం కోసం (1999)
6. ఇంద్ర (2002)
7. శంకర్ దాదా MBBS (2004)

## అంజనాద్రి బెట్టలో 'జై హనుమాన్' ప్రారంభం..



హనుమాన్ మూవీ సీక్వెల్ 'జై హనుమాన్' ప్రారంభమైంది. చారిత్రాత్మక పట్టణం హంపిలో పూజా కార్యక్రమం తాజాగా జరిగింది. చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మతో పాటు నటుడు రిషబ్‌శెట్టి తన సతీమణి కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. కర్ణాటకలోని హంపి సమీపంలో ఉన్న అంజనాద్రి బెట్టలో లాంఛనంగా మూవీ పనులు మొదలయ్యాయి. 2024లో తెలుగు చిత్ర పరిశ్రమలో సంచలన విజయాన్ని అందుకున్న హనుమాన్.. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. 150 థియేటర్లలో 50 రోజులు పూర్తి చేసుకొని రూ. 300 కోట్లు రాబట్టింది. ఇప్పుడు సీక్వెల్‌లో ఆంజనేయుడి పాత్రలో రిషబ్‌శెట్టి నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెరిగాయి. రామాయణంతో ముడిపడిన ఈ మైథలాజికల్ భారీ యాక్షన్ చిత్రాన్ని మైత్రీ మూవీస్ నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రశాంత్ ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నట్లు తెలిసింది.

**అంజనాద్రి బెట్టలోనే పూజా కార్యక్రమం ఎందుకో తెలుసా..**

'జై హనుమాన్' సినిమా పూర్తిగా ఆంజనేయుడి స్వామి చుట్టే తిరుగుతుందని దర్శకుడు ప్రశాంత్ వర్మ చెప్పారు. అందుకే సెంటిమెంట్‌గా అంజనాద్రి బెట్టలో పూజా కార్యక్రమంతో మూవీ చిత్రీకరణను ప్రారంభించారు. మన పురాణాల ప్రకారం ఈ ప్రాంతాన్ని హనుమంతుడి జన్మస్థలంగా నమ్ముతారు. హనుమంతుడు అంజనా దేవికి జన్మించారు. అందుకే ఈ ప్రాంతాన్ని అంజనాద్రి బెట్ట అని ఇప్పటికీ పిలుస్తారు. కొండ పైభాగంలో విశాలమైన హనుమాన్ ఆలయం ఉంది. దాదాపు 575 మెట్లు దాటుకుని పైకి చేరుకోవాల్సి ఉంటుంది. ఈ ఆలయంలో రాతితో చెక్కబడిన హనుమంతుడి విగ్రహం, కొద్ది సమీపంలో రాముడు, సీత మందిరాలు ఉన్నాయి. అక్కడే అంజనా దేవి ఆలయం కూడా ఉంది. ఈ ప్రదేశం పురాణాలలో కిష్కిందగా పిలువబడింది. ఈ కొండ హంపికి చాలా దగ్గరగా ఉంటుంది. ఇక్కడ మీరు రాతి రథం, హనుమాన్ ఆలయం, యంత్ర హనుమాన్ ఆలయంతో పాటు రాముడు, హనుమంతుడు మొదటిసారి కలిసిన ప్రదేశం ఇలా ఎన్నో మరెన్నో చూడవచ్చు.

## బ్లాక్‌బస్టర్ డ్రాగన్‌కు ఏడాది..

### రెండోసారి వస్తామంటున్న డైరెక్టర్



దర్శకుడిగా, హీరోగా హిట్టయినవారిలో ప్రదీప్ రంగనాథన్ ఒకరు. కోమలి సినిమాతో డైరెక్టర్‌గా పరిచయమైన ఇతడు లవ్ టుడేతో డైరెక్టర్ కమ్ హీరోగా భారీ సక్సెస్ కొట్టాడు. ఆ వెంటనే డ్రాగన్ సినిమా చేశాడు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించిన ఈ మూవీ కూడా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దాదాపు రూ.150 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఫిబ్రవరి 21న ఈ సినిమా వచ్చి ఏడాది అవుతోంది.

**రెండోసారి తప్పక వస్తాం**

ఈ సందర్భంగా అశ్వత్.. ప్రదీప్‌తో కలిసి దిగిన ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. డ్రాగన్ చిత్రానికి ఏడాది. సెల్ఫ్ మేడ్ స్టార్ ప్రదీప్‌తో కలిసి పని చేసిన అనుభవాన్ని మర్చిపోలేను. ఇద్దరు స్నేహితులు కలిసి పని చేస్తే ఎలా ఉంటుందో చూపించాం. మమ్మల్ని నమ్మినందుకు ఏజీఎస్ ప్రొడక్షన్ బ్యానర్‌కు, మా టీమ్‌కు కృతజ్ఞతలు. మేము సెకండ్ టైమ్ తప్పకుండా వస్తాం అని రాసుకొచ్చాడు.

**సినిమా**

దీంతో అభిమానులు డ్రాగన్ సీక్వెల్ ఉంటుందా? అని కామెంట్లు చేస్తున్నారు. మరి కొందరేమో డ్రాగన్ టీమ్ కాంబినేషన్‌లో ఒక కొత్త చిత్రం రాబోతుందేమోనని అభిప్రాయపడుతున్నారు. డ్రాగన్ విషయానికి వస్తే.. ప్రదీప్ హీరోగా నటించిన ఈ మూవీలో అనుపమ పరమేశ్వరన్, కయాదు లోహర్ హీరోయిన్లుగా యాక్ట్ చేశారు. ఈ చిత్రం తెలుగులో రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ పేరిట విడుదలై ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకుంది.

# ఏజ్ గ్యాప్ రొమాన్స్.. ఇప్పుడు ఇదే ట్రెండ్...



పెద్ద వయసు హీరోలు, పిన్న వయసు హీరోయిన్లు అనేది మన దేశ సినీ తెరపై కనిపించడం అత్యంత సర్వసాధారణ విషయం. అయితే తనకన్నా చిన్న వయసు హీరోతో పెద్ద వయసు హీరోయిన్ నటించడం, రొమాంటిక్ సీన్లను పండించడం అనేది చాలా అరుదు. హాలీవుడ్ చిత్రాల్లో బాగా పాప్యులరైన ఈ తరహా స్క్రీన్ రొమాన్స్ ఇటీవలి కాలంలో మన సినిమాల్లోనూ తరచు కనిపిస్తోంది. కనిపించినప్పుడల్లా కొంత చర్చనీయాంశంగా, వార్తాంశంగా మారుతున్నప్పటికీ నడివయసు హీరోయిన్స్ పట్టించుకోవడం లేదు. తమకన్నా 10 నుంచి– 25 ఏళ్ల వరకు తక్కువ ఉన్న వయసున్న హీరోలతో తెరపై జత కడుతున్నారు. అభిషేక్ బచ్చన్ భార్య, మాజీ మిస్ వరల్డ్ ఐశ్వర్య రాయ్ బచ్చన్ తన కన్నా 9ఏళ్లు చిన్నవాడైన రణ్‌బీర్ కపూర్ తో ఏ దిల్ హై ముష్కిల్ అంటూ రొమాన్స్ చేసింది. అయితే ఈ సినిమా కవి హృదయాన్ని ప్రేక్షకులు అర్థం చేసుకున్నారు కానీ బచ్చన్ కుటుంబం మాత్రం దీన్ని జీర్ణించుకోవడం బహుత్ ముష్కిల్ అంటూ ఆక్షేపించిందని వార్తలు వచ్చాయి.సైఫ్ అలీఖాన్ శ్రీమతి కపూర్ వంశ వారసురాలు కరీనా కపూర్ కి అండ్ కా అనే సినిమాలో అర్జున్ కపూర్‌తో పండించిన డేరింగ్ రొమాన్స్ ప్రేక్షకుల్ని కట్టి పడేసింది. అర్జున్ కపూర్ ఆమె కన్నా 20ఏళ్లు చిన్నవాడు కావడం విశేషం. అలాగే బ్రదర్స్ సినిమాలోనూ తనకన్నా 10ఏళ్ల చిన్నవాడైన సిద్ధార్థ్ మల్హోత్రాతో జోడీ కట్టడం ద్వారా కరీనా అలాంటి సాహసాలకు తాను వెనుకాడేది లేదని తేల్చి చెప్పింది.టాలీవుడ్ ప్రిన్స్‌తో కలిసి వారణాసి ద్వారా టాలీవుడ్‌కి వస్తున్న ప్రియాంక చోప్రా తన కన్నా నాలుగేళ్లు చిన్నవాళ్లయిన హీరో రణవీర్ సింగ్, అర్జున్ కపూర్ ఇద్దరితోనూ వేర్వేరు సినిమాల్లో సందడి చేసింది. ఇలా 5ఏళ్ల లోపు చిన్నవాళ్లతో నటించిన వారిలో రాణిముఖర్జీ(షాహిద్ కపూర్‌తో) శృతిహాసన్(గిరీష్ కుమార్‌తో) కొంకణా సేన్ శర్మ(రణబీర్ కపూర్‌తో)... ఇలా జాబితా ఎక్కువగానే ఉంది.వీళ్లందరూ ఒకెత్తయితే ఫిఫ్టీ ప్లస్ లో కూడా సింగిల్‌గా ఉంటూ ప్రేక్షకులను తరగని గ్లామర్‌తో కట్టిపడేస్తున్న టబు తన కన్నా వయసులో ఏకంగా పాతికేళ్లు చిన్నవాడైన ఇషాన్ ఖట్టర్‌తో రొమాన్స్ చేసి అందరికీ షాకిచ్చింది. ఆమెకు అతడు 'సూటబుల్ బాయ్' అనే దర్శక నిర్మాతల అభిప్రాయం ఎలా ఉన్నా ఈ సినిమా విమర్శకుల నోళ్లకు బాగానే పనిచెప్పింది. వృద్ధ హీరోల పక్కన కుర్ర హీరోయిన్లను చూపడానికి, చూడడానికి అలవాటు పడింది దక్షిణాది చిత్ర పరిశ్రమ. ఇప్పుడిప్పుడే ఇక్కడ సమ వయస్కుడైన హీరో తో హీరోయిన్లు నటించడం వరకూ కొంచెం మార్పు కనిపిస్తోంది. ఇక తమకన్నా వయసులో బాగా చిన్నవారి పక్కన నటించడం అనేది మన సౌత్‌లో ఇప్పట్లో సాధ్యం కాకపోవచ్చు. పెళ్లికైనా, ప్రేమకైనా మగవాళ్ల వయసు మహిళల కన్నా ఎక్కువ ఉండాలనే సంప్రదాయం నుంచే సినిమా పాత్రలు కూడా పురుడు పోసుకున్నాయి. అయితే ప్రస్తుతం మారుతున్న సామాజిక పరిస్థితులతో పాటు సినిమా పాత్రల తీరుతెన్నులు కూడా కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. మరోవైపు నడివయసులోనూ యువతులకు ధీటుగా గ్లామరస్‌గా కనిపించే హీరోయిన్లు పెరగడం కూడా దీనికి దోహదం చేస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com